# కరీంనగర్ సూర్య

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల

శనివారం 10 ఫిబ్రవరి 2024 | 11పేజీలు


## పాత కక్షలే హత్యకు కారణం



**- నిందితున్ని పట్టుకున్న పోలీసులు**

**సూర్య, కోరుట్ల టౌన్**

పట్టణంలోని అర్బన్ కాలనీలో అనుమల్ల వెంకటరమణ అనే వ్యక్తిని అదే ప్రాంతానికి చెందిన వాసాల రఘు గతంలో జరిగిన పాత కక్షల నేపథ్యంలోనే కత్తితో పొడిచి హత్య చేసినట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన (మిగతా 2లో)

# మీకోసం ప్రజాహిత యాత్రనై వస్తున్నా... ఆశీర్వదించండి..

### బిజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపి బండి సంజయ్ కుమార్

- నేటి నుంచి మేడిపల్లి నుండి ప్రజాహిత యాత్ర ప్రారంభం
- ఈ నెల 15 వరకు వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో తొలివిడత యాత్ర
- కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలతో యాత్రకు శ్రీకారం



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

గల్లీలో ఎవరున్నా...దేశ రక్షణ కోసం ఢిల్లీలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఉండాలని యావత్ భారత్ కోరుకుంటున్నదని... ఈ నేపథ్యంలో దేశ హితం కోసం, రాష్ట్ర హితం కోసం, కరీంనగర్ ప్రజల హితం కోసం కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా ఈ నెల 10 నుంచి ప్రజా హిత యాత్రనై మీ ముందుకు వస్తున్నానని... అహర్నిశలు శ్రమించి మన దేశాన్ని బలంగా తీర్చిదిద్దిన (మిగతా 2లో)

### భారత మాజీ ప్రధాని

## పీవీ నరసింహారావుకి భారతరత్న

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



బహుభాషా కోవిదులు 17 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన పండితులు భారత మాజీ ప్రధాని నరసింహారావుకి భారతరత్న ఆలస్యంగానైనా రావడం తెలుగు ప్రజలే కాదు భారత సాహిత్యాభిమానులు రాజకీయ అభిమానులు సంతోషించదగ్గ విషయం. సౌమ్యులు, అజాతశత్రువు అయిన పీవీ నరసింహారావు వరంగల్ జిల్లా నర్సంపేట లోని లక్నేపల్లిలో 1921లో జన్మించారు.వంగరలో ప్రాథమిక విద్య అభ్యసించిన పీవీ. వందేమాతర ఉద్యమంలో పాల్గొని కళాశాల నుంచి బహిష్కరణకు గురి అయ్యారు స్వాతంత్రోద్యమ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న సందర్భంలో వారు రాసిన గొల్ల రామవ్వ కథ ఎంతో ప్రాచుర్యం పొందింది. విశ్వనాథ వారి వేయి పడగలు నవలను హిందీలోకి అనువదించిన రచయిత (మిగతా 2లో)

## దేవుని మీద భక్తి... అంటే ఇలానే ఉంటుందేమో

**- సమ్మక్క - సారలమ్మ జాతరకై 24 సంవత్సరాలుగా సొంత ఖర్చులు**

**- మహారాష్ట్ర సమ్మక్క - సారలమ్మ చైర్మన్‌గా కండే జయరాజు**

**సూర్య, వీణవంక**

బహుశా అదృష్టం అంటే ఇతనిదేమో.... గత కొన్ని సంవత్సరాల నుండి ఆ దేవునికి సేవ చేసుకునే బాధ్యత ఇతనికే దక్కింది. ఇల్లు గడవడమే భారంగా ఉన్న ఈ రోజుల్లో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 24 సంవత్సరాలు దేవుని ఆశీస్సులతో సేవా చేసుకునే బాధ్యత కండే జయరాజు అనే వ్యక్తికి దక్కింది. వివరాల ప్రకారం..... కరీంనగర్ జిల్లా వీణవంక (మిగతా 2లో)



### జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట

## కానిస్టేబుల్ భార్య ఆత్మహత్యాయత్నం

**సూర్య, జగిత్యాల**



జగిత్యాల జిల్లా మల్యాల పోలీస్ స్టేషన్‌లో విధులను నిర్వహిస్తున్న ప్రసాద్ అనే కానిస్టేబుల్ భార్య భావన జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట శుక్రవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. సదరు కానిస్టేబుల్ గతంలో మొదట పెళ్లి చేసుకొని ఆమెకు విడాకులు ఇచ్చి బీర్పూర్‌కు చెందిన భావన అనే యువతిని ప్రేమించి ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. అయితే గత కొన్ని రోజులుగా సరిగ్గా చూసుకోవడం లేదని, వద్దు అని నిత్యం వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మనస్తాపం చెంది ఆత్మహత్యా యత్నంకు పాల్పడింది. అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది అడ్డుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### నకిలీ ధ్రువపత్రాలతో

## భూమిని విక్రయించిన వ్యక్తుల అరెస్ట్

**- అరెస్టయిన వారిలో కార్పొరేటర్ల భర్తలు,మరో వ్యక్తి**

**- కోర్టులో హాజరు... రిమాండ్ కు తరలింపు**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



రేకుర్తి భూమికి చెందిన నకిలీ ధ్రువపత్రాలను నిజమైనవిగా చూపించి (1,37,00000/-) కోటి ముప్పై ఏడు లక్షల రూపాయలు వసూలు చేసి మోసగించినందుకు 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కొల ప్రశాంత్, 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్, ఏలేటి భరత్ రెడ్డిలను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శివసాయినగర్‌కు చెందిన గునుకుల రాజిరెడ్డికి 2014 సంవత్సరంలో కమాన్‌పూర్‌కు (మిగతా 2లో)

# మీకోసం ప్రజా హిత యాత్రనై వస్తున్నా... ఆశీర్వదించండి

**(మొదటి పేజి తరువాయి)**

మోదీ ప్రభుత్వానికి నా కరీంనగర్ బలగం సైతం అండగా ఉందని చాటి చెప్పడానికి వస్తున్నానని.. ప్రజల ఆశీర్వాదం కోరుతూ... ప్రతి పల్లెకు, ప్రతి గడపకు మీ బిడ్డగా వస్తున్నానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,ఎంపి బండి సంజయ్ కుమార్ అన్నారు .కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా నేటి నుండి ప్రజా హిత యాత్రను వేములవాడ నియోజకవర్గం నుండి ఎంపి బండి సంజయ్ కుమార్ ప్రారంభిస్తు న్నారు. కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు చేసిన తర్వాత మేడిపల్లి నుంచి మన ప్రజా హిత యాత్ర ప్రారంభమ వుతుంది. ఈ నెల 15 వరకు వేములవాడ, సిరిసిల్ల నియోజ కవర్గాల్లో తొలి విడత యాత్ర సాగుతుంది. 119 కిలోమీటర్ల ఈ యాత్ర అనంతరం వేములవాడ నియోజక వర్గంలోని సంకెపల్లిలో తొలివిడత ముగింపు సభ ఉంటుంది. రెండో విడతలో మిగతా గ్రామాల్లో యాత్ర ఉంటుంది. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని దాదాపు ప్రతి గ్రామంలో ప్రజలతో మమే కమై సమస్యల్ని అడిగి తెలుసుకోవడంతో పాటు, మోదీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, బీజేపీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ చేస్తోన్న దుష్ప్రచారాలను ఈ యాత్ర ద్వారా తిప్పికొ డతమని అన్నారు. స్వరాష్ట్రం సిద్ధించి పదేళ్లవుతున్నా తెలంగాణ బతుకు చిత్రం ఇప్పటికీ మారలేదు. తొమ్మిది న్నరేళ్లు పాలించిన బీఆర్ఎస్ తెలంగాణ ప్రజానీకాన్ని అనేక విధాలుగా వంచించింది. ఇంటికో ఉద్యోగం అని గద్దెనెక్కి పూటకో మాట మార్చి పబ్బం గడుపు కుంది. టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ కుంభకోణంతో 30 లక్షల మంది నిరుద్యోగుల కలల్ని నాశనం చేసింది. నిరుద్యోగ సోదరులకు నెలకు రూ.3016 భృతి ఇచ్చి ఉంటే, ఊళ్ల నుంచి హైదరా బాద్ వెళ్లి చదువుకుంటున్న నిరుద్యోగుల కోచింగ్‌కు అది ఎంతోగానో సాయపడేది. కానీ, నాటి ప్రభుత్వం ఆ విషయాన్నే పట్టించుకోలేదని అన్నారు. ఇక, ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా తెలంగాణ పల్లెకు రాలేదు. రైతులకు రూ. లక్ష వరకున్న పంట రుణాలు మాఫీ చేశామని, ఫోన్లకు సందేశాలు పంపించారు. బ్యాంకుకెళ్లి చూస్తే రైతన్నలకు రిక్త హస్తమే మిగిలిందని అన్నారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను నెరవేరుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'ప్రజా పాలన' కార్యక్రమాన్ని నిర్వహించి ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జనవరి 17లోపు డేటా ఎంట్రీ పూర్తి చేసి, పథకాలు అమలు చేస్తామని చెప్పి వాయిదాలతో వాయిన మిస్తున్నది. డిజిటల్ యుగంలో దరఖాస్తులు తీసుకుని హడావిడి చేసిన కాంగ్రెస్ పార్టీ, ఆ దరఖాస్తులను ఏ మూలకు పడిసిందో తెలియని గందరగోళ పరిస్థితలను చూస్తున్నామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ఆధారం రేషన్ కార్డేనని తెలిసి కూడా గత ప్రభుత్వం 10 ఏళ్లపాటు ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదు. 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఆశ పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటికే రేషన్ కార్డులు ఇవ్వకుండా లక్షలాది మంది పేద కుటుం బాలను ఇబ్బంది పెడుతోంది. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ లాగే మాటల మాంత్రికుడని ప్రజలు తెలుసుకు న్నారని అన్నారు. పంట సీజన్ వెళ్లినా... రైతులకు రైతుబంధు సాయం అందకపోవడం రేవంత్ మాటల గారడీకి మరో నిదర్శనం. దీంతో తెలంగాణ ప్రజల పరిస్థితి పెనంలోంచి పొయ్యిలో పడ్డట్టయిందని అన్నారు. మీలో ఒకడినైన నన్ను మీ ఓటుతో కరీంనగర్ ఎంపీగా ఎన్నుకున్న కరీంనగర్ ప్రజలకు సదా నేను రుణపడి ఉంటానని అన్నారు. మీరు ఇచ్చిన అవకాశమే నాకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి పదవి కట్టబెట్టింది. మీరు ఇచ్చిన అవకాశంతోనే మోదీ సైనికుడిగా ప్రజా సంగ్రామ యాత్ర చేపట్టి రాష్ట్రంలో బీజేపీ విస్తరణకు కృషి చేశాను. ఎండనక, వాననక, చలి అనక రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు కళ్లారా చూసిన. భరోసా ఇచ్చిన. కష్టాల్లో ప్రజల పక్షాన నిలిచి పోరాడినందుకు నాపై 100కుపైగా కేసులు పెట్టినా, దాడులు చేసినా, జైల్లో పెట్టినా భయపడ కుండా మీరు ఇచ్చిన అవకాశం, ధైర్యం



తోనే పోరాడిన. మీరిచ్చిన అవకాశంతోనే నేడు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధా నాలను ఎండగడు తున్నాను. ప్రాణాలను తెగి ంచి కొట్లాడు తున్ననని అన్నారు. కానీ, కరీం నగర్ గడ్డపై పుట్టిన ఈ బిడ్డ... కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులేమీ తేలేదని కొంతమంది పనిగట్టు కుని ఆరోప ణలు చేస్తున్నారు. అబద్ధాలతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎంపీగా ఎన్నికైన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ కోసం 12 వేల కోట్ల రూపాయల కుపైగా ఖర్చు చేసిందని అన్నారు. దేశ హితం కోసం అబ్‌కీ బార్ 400 పార్, తీస్రీ బార్ మోదీ సర్కార్ నినాదంతో... మూడోసారి బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకై జరుగుతున్న ఈ మహాయాగంలో మరోసారి సమిధగా మారడానికి కరీంనగర్ మీ బిడ్డ సిద్ధమయ్యాడని. మీ చేతిలో రెపరెపలాడే కాషాయ జెండాగా మారడానికి, మీ ఆశీస్సుల కోసం ప్రజాహిత యాత్రగా మీ గడపకొస్తున్నాడని.. మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తారని ఆశిస్తూనని అన్నారు.

## పాత కక్షలే హత్యకు కారణం

**(మొదటి పేజి తరువాయి)**

విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ రఘు కుటుంబ సభ్యుల గురించి వెంకటరమణ తప్పుడు ప్రచరం చేస్తున్నాడని, పాత పగల కారణంగా అర్బన్ కాలనీలో వెంకటరమణతో రఘు గొడవకు దిగాడని, దీంతో ఆవేశానికి గురైన రఘు కత్తితో రమణను పొడిచి చంపాడు. మృతుడు వెంకటరమణ భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామన్నారు. నిందితుడు రఘు కోసం గాలింపు చర్యలు చేపట్టగా రఘు టివద్దే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించమన్నారు. కాగా హత్యకు ఉపయోగించిన కత్తి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎస్సై కిరణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## నకిలీ ధ్రువపత్రాలతో భూమిని విక్రయించిన వ్యక్తుల అరెస్ట్

**(మొదటి పేజి తరువాయి)**

చెందిన పంజాల శ్రీనివాస్ ద్వారా సుదగొని కృష్ణ గౌడ్ తో పరిచయం ఏర్పడింది. ఇదిలా ఉండగా ఒక సందర్భంలో సుధగోని కృష్ణ గౌడ్, గునుగుల రాజిరెడ్డితో రేకుర్తి శివారులోని సర్వేనెంబర్ 119 లో 25 గుంటల భూమి 100 ఫీట్ల రోడ్డుకు ఆనుకునే ఉంటుందని, భవిష్యత్తులో వ్యాపార పరంగా ఉపయోగపడే అవకాశం ఉందని అది ప్రస్తుతం అమ్మకానికి కలదని తెలుపగా, రాజిరెడ్డి అట్టి భూమి కొనుగోలుకు ఒప్పుకోగా, సుధగోని కృష్ణ గౌడ్ మరియు జక్కుల మల్లేశం ఇరువురు కలిసి ఉమ్మడిగా గుంటకు ఆరు లక్షల చొప్పున అగ్రిమెంట్ చేసుకుని 31 లక్షలను ముందుగా భయానగా ముట్టచెప్పి అట్టి భూమి యొక్క హద్దు నిర్మాణాలు చేపట్టెందుకు వెళ్లగా, ఇతరులు అట్టి భూమి తమదని తనతో గొడవకు దిగారని బాధితుడు రాజిరెడ్డి తెలిపాడు. ఇదే విషయాన్ని సుధగోని కృష్ణగౌడ్‌కు తెలపగా ఆ భూమికి బదులుగా తనకు తెలిసిన వేరొక భూమి సర్వేనెంబర్ 79/B లో 20 గుంటల భూమి అమ్మకానికి కలదని, కానీ అది గుంటకు 9 లక్షల చొప్పున ఇప్పిస్తానని తెలిపారని, అయినా ఒప్పుకున్నని ఈ విషయమై 2016 సంవత్సరం జూలై 1వ తేదీన సేల్ అగ్రిమెంట్ డీడ్ కూడా చేసుకున్నా మన్నారు. తర్వాత సర్వేనెంబర్ 79/బి లో అమ్మకానికి గల 20 గుంటల భూమి కొనుగోలుకై వివిధ వాయిదాల్లో 76 లక్షలు సుధగోని కృష్ణ గౌడ్‌కి చెల్లించామని తదుపరి భూమి రిజిస్ట్రేషన్ చేయించవలసిందని కోరగా, కంకణాల భాగ్యలక్ష్మి, కంకణాల సుజాత పేరిట ఉన్న 700 చదరపు గజాలను, రాజిరెడ్డి తమ్ముడైన గునుకుల సంపత్ కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడని, తదుపరి మిగిలిన భూమి రిజిస్ట్రే షన్ చేయించమని కోరగా వడ్డేపల్లి కరుణాదేవి భర్త రాజయ్య పేరిట ఉన్న 1210 చదరపు గజాల భూమిని తన సోదరుడైన గునుకుల సంపత్ కుమార్ పేరిట 2017 వ సంవత్సరం ఫిబ్రవరి 14వ తేదీన రిజిస్ట్రేషన్ చేయించాడని బాధితుడు గునుకుల రాజిరెడ్డి తెలిపాడు. పై రిజిస్ట్రేషన్ చేయించిన భూములకు సంబంధించిన లింకు డాక్యుమెంట్లు సుధగోని కృష్ణగౌడ్‌ను అడగగా గజ్జల స్వామి పేరుపై 2006 జనవరి రెండో తేదీ పై జిపిఏ కాబడిన డాక్యుమెంట్ ఇచ్చాడని, ఆ డాక్యుమెంటు పరిశీలించుకోగా అది కూడా వివాదాల్లో ఉన్న ధ్రువపత్రమని తెలిసిందని బాధితుడు తెలిపారు. నిజానికి హస్తపురం అంజయ్య తండ్రి దుర్గయ్యకు 1991 సంవత్స రంలో ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్ ఇచ్చిందని, 2002వ సంవత్సరంలో 10 గుంటల భూమిని రేకుర్తికి చెందిన వడ్డేపల్లి కరుణాదేవి భర్త రాజయ్యకు మిగిలిన 10 గుంటల భూమిని వడ్డేపల్లి రాకేష్ తండ్రి రాజయ్యలకు అమ్ముకు న్నాడని తెలిసిందని బాధితుడు అన్నారు. ఇదిలా ఉండగా బాధితుడు గునుకుల రాజిరెడ్డి 700 చదరపు గజాల భూమిని గజ్జల స్వామి పేరిట తిరిగి జిపిఏ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాడని, అదే 700 చదరపు గజాలను గజ్జల స్వామి, కంకణాల భాగ్యలక్ష్మి, కంకణాల సుజాతల పేర్లిట రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిపాడు. ఇట్టి విషయమై సుధ గౌడ్ ని కృష్ణ గౌడ్ నిందితుడు పలుమార్లు తన వద్ద తీసుకున్న డబ్బులకు భూమి రిజిస్ట్రేషన్ చేయించవ లసిందిగా కోరగా పలు మార్లు దాటవేశారన్నారు. ఎన్నిసార్లు ఇట్టి విషయమై అడిగిన సుధగోని కృష్ణగౌడ్ స్పందించకపోగా ఇప్పటివరకు కాలయా పన చేస్తూ వచ్చాడన్నారు. ఇదిలా ఉండగా సుధగోని కృష్ణగౌడ్ ఒకరోజు గునుకుల రాజిరెడ్డిని రేకుర్తిలోని తన ఆఫీసుకు పిలిపించి కోలప్రశాం త్‌ను పరిచయం చేస్తూ తన భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరిస్తాడని తెలిపాడన్నాడు. ఈ విషయమై వీరివురు కలిసి సుధగోని కృష్ణగౌడ్, కోల ప్రశాంత్ భూమి సెటిల్మెంట్ అగ్రిమెంట్ అని తయారుచేసి తను కొనుగోలు చేయాలనుకున్న భూమి బసవయ్య పేరిట ఉందని ఆ సమస్యను పరిష్కరిం చేందుకుగాను మొత్తంగా 50 లక్షల రూపాయలు ఇవ్వవలసిందిగా కోరారన్నాడు. వేరే గత్యంతరం లేక అడ్వాన్స్‌గా 20 లక్షల రూపాయలు తనకు 2021 వ సంవత్సరం జూలై ఆరో తేదీన కోల ప్రశాంత్ కు అప్పగించానని మిగిలిన మొత్తం 30 లక్షల సమస్య పరిష్కరించిన తరువాత ఇచ్చేవి ధంగా ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపాడు. సమస్యను పరిష్కరించాలని, తాను ఇచ్చిన డబ్బులకుగాను భూమిని రిజిస్ట్రేషన్ చేయించవ లసిం దిగా బాధితుడు పలుమార్లు కోరి నప్పటికీ మళ్ళీ మిగిలిన 30 లక్షలు ఇవ్వవల సిందిగా లేనియెడల భూ సమస్య పరిష్కా రం కాకుండా అడ్డుకుంటామని, సమస్యలు సృష్టిస్తామని, అవసరమైతే చంపేస్తామని బెదిరింపులకు గురి చేశారన్నారు. ఆలస్యంగా గ్రహించిన బాధితుడు గునుకుల రాజిరెడ్డి, తను పూర్తిగా మోసపో యానని తెలుసుకున్న బాధితుడు గునుకుల రాజిరెడ్డి కొత్తపల్లి పోలీస్ స్టేషన్ నందు తనకు జరిగిన అన్యాయం పై శుక్రవారం నాడు ఉదయం ఫిర్యాదు చేయగా నందు కేసు 52/2024 నమోదు చేసి విచారణ జరుపగా బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సుధగోని కృష్ణ గౌడ్ గునుకుల రాజిరెడ్డికి నకిలీ ధ్రువపత్రాలు నిజమైనవిగా చూపించి ఒక కోటి ముప్పై ఏడు లక్షల రూపాయలు వసూలు చేసి మోసగించడమే గాక బెదిరింపులకు గురిచే సానని విచారణలో తేలింది. పై అక్రమ చర్యలకు పాల్పడి నందుకు గాను ముగ్గురు వ్యక్తులైన రేకుర్తికి చెందిన 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణ గౌడ్, మల్యాల మండలం రామన్నపేట కు చెందిన చేలేటి భరత్ రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్‌లపై 420, 465, 467, 468, 471, 386, 506, 120-b r/w 34 IPC ల ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదవు చేసి గౌరవ ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్టు నందు హాజరుపరచగా గౌరవ మెజిస్ట్రేట్ 14 రోజుల కస్టడీని విధించగా రిమాండ్ కు తరలించారు.

## దేవుని మీద భక్తి..... అంటే ఇలానే ఉంటుందేమో

**(మొదటి పేజి తరువాయి)**

మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కండే జయరాజు గత 24 సంవత్సరాల నుండి మహారాష్ట్రలోని రాజుర పెనుగంగ పక్కన వెలిసిన శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతరను విజయవంతంగా జరిపిస్తున్నారు. సుమారుగా ఈ జాతరకు లక్ష వరకు జనం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, యూపీ, ఎంపీ, ఒరిస్సా రాష్ట్రాల నుండి ఈ జాతరకు రావడం జరుగుతుంది. ఒక తెలంగాణ రాష్ట్ర ముద్దుబిడ్డ జయరాజు మహారాష్ట్రలో శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతరను జరపడం ఎంతో గొప్ప విషయమని, ఆయన గురువైన మహారాష్ట్ర మాజీ మంత్రి సుధీర్ మునిగంటి వార్ సహకారంతో గత 24 సంవత్సరాలుగా ఏకధాటిగా శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతరను విజయవంతం చేయడం ఎంతో శుభసూచకమని పేర్కొన్నారు.

**ఆ దేవుని ఆశీస్సుల కోసం ఎల్లప్పుడూ సేవా చేస్తూ ఉంటా..... కండే జయరాజు.....**



దేవుడు ఇచ్చిన వరంతో నా సంపాదనలో కొంత ఉన్నంతలా ఆ దేవునికే ఖర్చు పెడుతున్నానని, ఇది భారం కాదు..... బాధ్యత గా నేను భావిస్తున్నానని తెలిపారు. 25వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే జనాలకి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని హంగు ఆర్భాటాలతో ఉచిత విద్యుత్, లైటింగ్, నీటి సదుపాయం, అన్నదానం కల్పిస్తు న్నామని అన్నారు. ఈ జాతరకు వచ్చే భక్తులకు బస్సు సౌకర్యం, ట్రైన్ సౌకర్యం కలదని, కావున ప్రజలు శ్రీ సమ్మక్క - సారక్క జాతరను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

**పొన్నం కొండయ్య గౌడ్ నర్సింగాపూర్ వాసి.....**

సమ్మక్క - సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రతి జాతరకు ఏర్పాట్లను చేస్తున్నామని, ఇక్కడ దేవునికి మొక్కుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రతీతి.

**రాచర్ల తిరుపతి నర్సింగాపూర్ వాసి......**

గత 24 సంవత్సరాల నుండి సమ్మక్క - సారలమ్మ జాతరలో వాలంటీర్ గా పనిచేస్తున్నామని, ప్రతి ఒక్క పని బాధ్యతగా నిర్వహిస్తూ జాతర జరిపిస్తున్నామని తెలిపారు.

## భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి భారతరత్న

**(మొదటి పేజి తరువాయి)**

పీవీ నరసింహారావు. అద్భుతమైన ప్రసంగం వ్యాసరచన శక్తి కలిగిన పీవీ నరసింహారావు గారు 1957లో రాజకీయ జీవితాన్ని ప్రారం భించారు. 1972లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్య మంత్రిగా పనిచేసే వారు పట్టణ భూగరిష్ట చట్టం తీసుకొచ్చారు. వారి ఆలోచనలు దేశాన్ని నడిపించే అంత గొప్పగా ఉన్నాయని ఎంతో మంది రాజకీయ మేధావులు వారి సలహాలు తీసుకునే వారు.పివిని చాలా గౌరవ ప్రదంగా చూసేవారు. ప్రతిపక్ష పార్టీలు సైతం ఆయనకు విశిష్టమైన మర్యాదనిచ్చేవారు. 1991 లో నంద్యాల లోక్ సభ నియజకవర్గం నుండి పోటీ చేసిన పీవీ 5 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచి గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించారు. 1991 నుంచి 1996 వరకు విమర్శరహితమైన ప్రధా నిగా దేశానికి విశేషమైన సేవలను అందించి ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిన దేశాన్ని రక్షించారు. వారి హయాంలోనే నూతన ఆర్థిక సంస్కరణలకు విప్లవాత్మకమైన మార్పులు వచ్చా యి. వారిని స్ఫూర్తిగా తీసుకుని తర్వాతి కాలం ఆర్థిక మంత్రులు ప్రధానులు ఎన్నో సంస్కరణలు చేసి పరిపాలన సాగించారు. 2004లో గుండెపోటుతో మరణించిన భరత మాత ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకి ఇప్పటికైనా భారతరత్న రావడం పట్ల తెలంగాణ, తెలుగు ప్రజలు ఎంతో గర్వపడుతున్నారు.

# పాత సర్వే ప్రకారం హైవే రోడ్డును నిర్మించండి

**- భూములు కోల్పోతున్న బాధితుల ఆందోళన - న్యాయం చేస్తామన్న ఆర్డీవో రాజేశ్వర్**

**సూర్య -కోరుట్ల**



పాత సర్వే ప్రకారం హైవే రోడ్డును నిర్మించండి అని భూములు కోల్పోతున్న బాధితులు ఆందోళనకు శుక్రవారం దిగారు. వివరాల్లోకి వెళితే... నిజామాబాదు నుండి జగదల్పూర్ వరకు నూతనంగా ఏర్పాటు చేయనున్న నేషనల్ హైవే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుచున్నవి. అందులో భాగంగా కోరుట్ల పట్టణంలో గత కొన్ని రోజుల నుండి నేషనల్ హైవే సర్వే అధికారులు రోడ్డు వెళ్లే ప్రాంతంలో సర్వే చేస్తున్నారు. తాజాగా గత మూడు రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని బొమ్మన రోడ్డు ప్రాంతంలో సర్వే చేశారు. గతంలో చేసిన సర్వేలో వేరే భూముల నుండి నేషనల్ హైవే వెళుతుందదని, కానీ ప్రస్తుతం ఆ విధంగా కాకుండా తమ భూములనుండి నేషనల్ హైవే వెళుతున్నట్లు సర్వే చేస్తున్నారని భూములు కోల్పోతున్న బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం సర్వే చేస్తున్న అధికారులను భూములు కోల్పోతున్న వారు అడ్డగించి సర్వేను నిలుపుదల చేశారు. గురువారం కోరుట్ల ఆర్డిఓ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం భూములు కోల్పోతున్నవారు వారి భూముల వద్దకు వెళ్లి ఆర్డిఓ వచ్చి న్యాయం చేయాలని కోరగా, కోరుట్ల ఆర్డిఓ రాజేశ్వర్ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. తమరి సమస్యను ఉన్నంత అధికారులకు నివేదిక అందించి న్యాయం జరిగేలా చేస్తానని ఆర్డిఓ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పసుల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తమ తాతలు సంపాదించిన ఆస్తి అని , భూములు కోల్పోతే దిక్కులేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం గతంలో చేసిన సర్వే విధంగా హైవే బైపాస్ రోడ్డును నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ,రాష్ట్ర ముఖ్యమంత్రి నీ కలుస్తామన్నారు. గే లే శ్రీనివాస్, అల్లే నరేందర్, పసుల రాంగోపాల్, చంటి చంద్రబాబు, పసుల హరీష్, చంటి శ్రీనివాస్, ఆ ప్రాంత రైతులు తదితరులు ఉన్నారు.



## సూర్య జగిత్యాల

## కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ఆందోళన

**సూర్య జగిత్యాల టౌన్**



గత రెండు నెలలుగా జీతాలు చెల్లించట్లేదు అని జగిత్యాల జిల్లాలోని ఆశావర్కర్లు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో కుటుంబపోషణ బారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు 18వేలు ఫిక్స్ వేతనంతో పాటు ఈఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## సామాజిక రుగ్మతలపై పోలీస్ కళాజాత ప్రదర్శన

**సూర్య,రాయికల్**



జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూటపెల్లి గ్రామంలో గురువారం రాత్రి సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళా బృందం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు రాయికల్ ఎస్సై అజయ్ తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం వారు మూఢ నమ్మకాలు,ఆత్మహత్యల నివారణ,రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు,గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు,సైబర్ మోసాలు,నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు పాటలు నాటికలతో అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.నేను సైతం అనే కార్యక్రమం ద్వారా పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని,దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తుందని ఆయన తెలిపారు.సిసి కెమెరాలు ఏర్పాటు కు సహకరించాలని గ్రామస్థులను కోరారు.తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని,యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని,ప్రభుత్వం ,పోలీస్ తరపున అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయని ఆయన అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని,లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని,వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు.గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని ఆయన అన్నారు.గ్రామంలో చిన్న చిన్న తగాదాలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేరరహిత గ్రామాలుగా చేయడానికి ప్రజలు కృషి చేయాలని సూచించారు.మంత్రాలు తంత్రాలు మూఢనమ్మకాలు నమ్మవద్దని,గ్రామాల్లో ఏ సమస్య వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బెక్కం తిరుపతి,పోలీసు సిబ్బంది,పోలీస్ కళా బృందం సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

**సూర్య -కోరుట్ల**

లయన్స్ క్లబ్ ఆఫ్ కోరట్ల , లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ వారి ఆధ్వర్యంలో లయన్ ఆడేపు మధు – కమల సహకారంతో వినాయక డెంటల్ కేర్ హాస్పిటల్ డాక్టర్ ఆడెపు అనురాగ్ %వీణా% సౌజన్యంతో శుక్రవారం శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో ఉచిత దంత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించడం జరిగింది.ఇట్టి సందర్భముగా సుమారు 300 మంది పిల్లలకు దంత సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ వారికి అవసరమైన మందులు, టూత్ బ్రష్ లు, పేస్ట్ లు, మౌత్ వాష్ లు ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఇరు క్లబ్ ల అధ్యక్ష కార్యదర్శులు వనపర్తి చంద్ర మోహన్ – రమ్య, కుందారపు మహేందర్ – ప్రేమలత, ట్రేసరర్ కొండబత్తిని రాధిక కృష్ణ మరియు జోన్ ఛైర్మెన్ అల్లాడి శోభ ప్రవీణ్, క్లబ్ సీనియర్ నాయకులు డాక్టర్ గంద్ర దిలీప్ రావ్, ఆడేపు మధు – కమల, ఎలిమిళ్ళ ఉషా కిరణ్,గుంటుక సురేష్ బాబు, ఏలేటి లక్ష్మారెడ్డి, పొలాస రవీందర్ – గీత, రుద్ర సుజాత, పాఠశాల కోశాధికారి నీలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గోపు వెంకటేష్, కొండ బత్తిని అమర్నాథ్, ఆడేపు ఆనంద్, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## దేవాదాయ శాఖ భూమిలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు టెండర్లు...

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారికి అనుకుని ఉన్న దేవాదాయ శాఖ స్థలం సంవత్సర కాలానికి గాను 22 లక్షల 5 వేలకు టెండర్ ఖరారు అయింది. సర్వేనెంబర్ 171 లోని రెండు ఎకరాల విస్తీర్ణంలో గల స్థలంలో సంవత్సర కాలం పాటు వివిధ తాత్కాలిక వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు గాను దేవాదాయ శాఖ టెండర్లకు ఆహ్వానించింది. శుక్రవారం స్థానిక శివాలయంలో జరిగిన బహిరంగ టెండర్ ప్రక్రియలో గుర్రాల వంశీకృష్ణ ఈ స్థలాన్ని 22 లక్షల 5 వేలకు టెండర్ ను దక్కించుకున్నాడు. టెండర్ మొత్తంలోని సగం డబ్బులను టెండర్ ప్రక్రియ పూర్తికాగానే లేజుదారు చెల్లిస్తాడని ఈవో పనతుల వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**సూర్య జగిత్యాల**



సమగ్ర ఎన్నారై పాలసీతో కూడిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. టిపిసిసి ఎన్నారై సెల్ చైర్మన్ డా. బి.ఎం వినోద్ కుమార్, టిపిసిసి ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, వలస కార్మికుల నాయకురాలు సిస్టర్ లిజీ జోసెఫ్ శుక్రవారం జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఈ బడ్జెట్ లో గల్ఫ్ సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీ లాబీలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను కలిసి గల్ఫ్ సంక్షేమం అంశాన్ని వారి దృష్టికి తీసికెళతానని జీవన్ రెడ్డి భరోసా ఇచ్చారని భీం రెడ్డి తెలిపారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు విషయం ఇదివరకే సీఎం దృష్టికి తీసికెళ్లానని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

# వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరుపాలి

**- సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్**

**సూర్య జగిత్యాల టౌన్**



రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మహత్యలకు పాల్పడ్డా వారి మృతి పట్ల విచారణ జరిపించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో వృద్ధుల ఆత్మహత్యలు– అభద్రత,నివారణ అన్న అంశముపై తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని అసోసియేషన్ కౌన్సెలింగ్ కేంద్రంలో జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మాట్లాడుతూ ఆత్మహత్యల వంటి భాదాకర నిర్ణయం తీసుకొని తమ జీవితానికి ముగింపు కోరుతున్న వారిలో ఎక్కువ మంది వృద్ధులే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో వారి పోషణను కొందరు కొడుకులు, కొడళ్లు, కూతుర్లు పట్టించుకోకపోవడం , వయోవృద్ధులైన తల్లిదండ్రులను హింసకు గురిచేయడం, బలవంతంగా వారి ఆస్తులను తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, వంటి విపరీత ధోరణులు కన్పిస్తున్నాయన్నారు. పలువురు నిరాదరణకు గురైన వయోవృద్ధులు తమ అసోసియేషన్ ను ఆశ్రయిస్తున్నారని, కౌన్సెలింగ్ చేస్తే కొందరు ఆదరిస్తున్నారని,మరి కొందరు వినక పోతే జిల్లాలోని జగిత్యాల,కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ల ఆర్డీవోల వద్దకు వారిని తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. .ఆర్థిక,ఆరోగ్య సమస్యల ఒత్తిళ్లతో వృద్ధులు తీరని అభద్రతకు గురవుతున్నారని ,నివారించడానికి వారిని ఆదరిస్తూ జాగ్రత్తగా చూసుకోవడం వారి కొడుకులు, కొడళ్లకు,కూతుర్లకు, వారి పిల్లలతో సహా అందరి పవిత్ర కర్తవ్యమన్నారు. సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి బలమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం అత్యవసరమని తమ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహారావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ల దృష్టికి తీసుకు పోయామన్నారు. వారు సానుకూలంగా స్పందించారన్నారు. కేంద్రప్రభుత్వం 2019 లో పెట్టిన వయోవృద్ధుల సంరక్షణ చట్టంలో ప్రయోజకర సవరణలను రాజకీయాల కతీతంగా పార్లమెంట్ లో ఆమోదానికి అన్ని పార్టీలు కృషి చేయాలన్నారు. వృద్ధాప్య జనాభా నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి ఆరోగ్య వ్యవస్థకు కొత్త రూపమివ్వాల్సిన అవసరం ఉందని,సీనియర్ సిటిజన్స్ కు బ్యాంకులు,ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో,రవాణా వ్యవస్థల వద్ద ఎక్కువ కాలం నిలబెట్టి ఉంచడం మన దేశ నాగరిక విలువలకు వ్యతిరేకమని ,వారికి సహకారాలు అందించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారనే విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత రెడ్డి,బొల్లం విజయ్,ఎం.డి.యాకుబ్,ఆర్గనైజింగ్ కార్యద ర్శులు పూసాల ఆశోక్ రావు, కొయ్యడ సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది పి.సతీష్ రాజ్, మానాల కిషన్,సింగం గంగాదర్, భూమయ్య, నక్క ఇంద్రయ్య, కండ్లే గంగాదర్, దుబ్బేశం, సయ్యద్ యూసుఫ్, ఎం.డి.ఎక్బాల్,, గంగారెడ్డి,కన్నాపురం సుధాకర్, సంజీవ రావు, వీరేశం,పబ్బా శివానందం, రాజ్ మోహన్,లక్ష్మీ నారాయణ, ఎం.డి సైఫోద్దీన్ ,మురళి, జిల్లా, డివిజన్, వివిధ మండలాల సీనియర్ సిటిజన్స్ ,వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైభవంగా మాఘ అమావాస్య జాతర

## - భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు - మామిడిపల్లి మాఘ అమావాస్య జాతరలో భక్తులు

## - మామిడిపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సూర్య, కోనరావుపేట**

వేములవాడ అనుబంధ దేవాలయమైన కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నాగారం గ్రామాల్లోని శ్రీ సీతారామస్వామి ఆలయంతో పాటు ధర్మారంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘ అమావాస్య జాతర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరునహరికృష్ణ, లక్ష్మణా చార్యులు, భాస్కర్ స్వామివారికి అష్ట పూజ, అభిషేకం, పుణ్యాహవాచనం, విష్ణు సహస్ర పారాయణం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అద్దాల మండలంలోని సీతారామ స్వామిలను దర్శించుకుని ప్రత్యేకపూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఏర్పాటు చేసినా ప్రత్యేక బస్సుల ద్వారా ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే స్వామీ వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు



అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**- స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్**

మాఘ అమావాస్య జాతర పర్వదినాన కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి సీతారామచంద్రస్వామి వారలను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం ఉదయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సీతారామచంద్రస్వామి ఆశీస్సులతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి రామరాజ్యాన్ని తలపించే విధంగా ప్రజాపాలన చేస్తామని అన్నారు. రాష్ట్రంలో సంపదను పెంచి, ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందిస్తామన్నారు. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే విధంగా బలాన్ని ఇవ్వాలని స్వామి వారిని కోరానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు....**

వేములవాడ అనుబంధ ఆలయం మామిడిపల్లి, నాగారం సీతారామచంద్రస్వామి ఆలయాలతో పాటు ధర్మారం శ్రీ వెంకటేశ్వర స్వామి



ఆలయంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, చల్మెడ లక్ష్మీనరసింహ రావు, ఏనుగు మనోహర్ రెడ్డి స్వామీ వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎదురుగట్ల చంద్రయ్య గౌడ్,, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, పాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్ రావు,ప్యాక్స్ డైరెక్టర్లు పోట్లపల్లి సత్యనారాయణ రావు,ఇప్ప రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల దేవయ్య,నాయకులు రాఘవరెడ్డి,జగన్ రెడ్డి,జగిడి బాపురెడ్డి,వెంగలి వెంకన్న,గున్నాల లక్ష్మణ్,అసరి రాజు,మిర్యాల్ కార్ బాలాజీ, పోట్లపల్లి గోపాల్ రావు,అతికం శ్రీనివాస్,నాగుల రాజు, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించని ఎంపీడీవో సస్పెన్షన్

**-మరో 6 నెలల్లో రిటైర్డ్ కానున్న ఎంపిడివో**

**సూర్య, సెంటినరీ కాలనీ**



ప్రోటోకాల్ నిబంధనలు విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామగిరి ఎంపిడిఓ ఐ.రమేష్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. కమాన్ పూర్ ఎంపీపీ కార్యాలయానికి చెందిన ఎంపీడీవో ఐ.రమేష్ డిప్యూటేషన్ పై రామగిరి ఎంపీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాటించాల్సిన ప్రోటోకాల్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవో ఐ.రమేష్ తన కార్యాలయ విధుల పట్ల సైతం గౌరవపూర్వకంగా వ్యవహరించడం లేదని గమనించనైనదని, అనేక మార్లు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ జనవరి 31న జరిగిన కార్యక్రమంలో సైతం శిలాఫలకంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పాత తేదీతో ఉన్న శిలాఫలకం పెట్టి బాధ్యత రహితంగా ఉన్న కారణంగా షోకాజ్ నోటీసులు జారీ చేసిన తర్వాత సదరు ఎంపిడిఓ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో పై ఉన్న క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ ముగిసే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని, సస్పెన్షన్ కాలంలో సదరు ఉద్యోగి తన అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళవద్దని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా ఎంపిడివో రమేష్ మరో ఆరు నెలల్లో పదవీ విరమణ పొందనున్నారు.

## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ జిల్లా శాశ్వత సభ్యుడు నేరెళ్ల బాలు (మంజునాథ డిజిటల్) గత మూడు నెలలుగా తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఫోటోగ్రాఫర్ కుటుంబ సభ్యులకి రాష్ట్ర అసోసియేషన్ ద్వారా పదివేల రూపాయలు ,కరీంనగర్ పట్టణ, జిల్లా అసోసియేషన్ ద్వారా 20,400/- చెక్కు రూపంలో జిల్లా అసోసియేషన్ సిరి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ చందు, పట్టణ ప్రధాన కార్యదర్శి నగిశెట్టి రమేష్ ద్వారా చెక్కు అందించడం జరిగింది.పెద్ద మనసుతో ఆర్థిక సాయం అందించిన రాష్ట్ర అసోసియేషన్ పెద్దలకు జిల్లా అసోసియేషన్ కుటుంబ సభ్యులకు, పట్టణ ఫోటోగ్రాఫర్ సభ్యులకు జిల్లా అసోసియేషన్ తరపున పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజాని శంకర్, రాజు స్టూడియో రాజు ,మిట్ట రాము, రాయి శెట్టి శ్రీధర్, కొక్కుల శ్రీకాంత్ ,మచ్చ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన పాత్రికేయుడు.

**సూర్య,రాయికల్3**



రాయికల్ మండలం లోని ధర్మాజీ పేట గ్రామంలో గల రెండు నిరుపేద కుటుంబాలకు రాయికల్ పాత్రికేయులు కడకుంట్ల జగదీశ్వర్ తన జన్మదిన వేడుకల సందర్భంగా బియ్యం, కూరగాయలు,నూనె పప్పు తదితర నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతృప్తిగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాత్రికే యులు ఎద్దండి ముత్యంపు రాజురెడ్డి,చింతకుంట సాయికుమార్, మారంపెల్లి హరీష్, ఇమ్మడి విజయ్,సయ్యద్ రసూల్,కళ్లెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళను వివస్త్ర చేసి దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**- ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు పారునంది జలపతి**

**సూర్య, తిమ్మాపూర్**



ఇటీవల కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఓ గ్రామంలో దళిత మహిళను వివస్త్రను చేసి,కంట్లో కారం కొట్టి గ్రామంలోనీ నడి బజార్లో అందరు చూస్తుండగానే చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు గురిచేసిన దుండగులపై కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పారునంది జలపతి డిమాండ్ చేసినారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా ఒక దళిత మహిళను వివస్త్ర చేసి దారుణంగా కొట్టిన దుర్మార్గపు చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను అని అన్నారు.గ్రామంలోకి వలస వచ్చి బ్రతుకుతున్న దానికి వారిపై దాస్టికంగా దాడి చేసి,ఇంతటితో ఆగకుండా మరో గ్రామానికి తీసుకువెళ్లి మహిళను చెట్టు కట్టేసి దారుణంగా కొట్టి భయభ్రాంతులకు గురిచేసి ఇంత అరాచకం చేస్తున్న ఘటన ఇప్పటివరకు బయటకు రాకుండా చేస్తు ఈ సంఘటనపై కేసు నమోదు కాకపోవడం బాధాకరం అని అన్నారు. ఇట్టి సంఘటనను సుమోటగా తీసుకొని నిందితులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి బాధిత మహిళకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఇట్టి సంఘటనకు కారణమైన దుండగులను ఎంతటి వారైనా ఉపేక్షించవద్దానీ వెంటనే నిందితులను అదుపులోకి తీసుకోవాలని బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకూ అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు.

## మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించాలని వినతి

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ బస్టాండ్ లోని మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్యకు హుజురాబాద్ హెల్ప్ టీం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బస్టాండ్ లో ప్రజల అవసరాల కోసం నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దుర్వాసనతో నిండిపోయిందని, ఆ మార్గం గుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు మున్వర్, షఫీ, ఇర్ఫాన్, హర్షద్, బాబా, ఫరూక్, రకీబ్, అబ్దుల్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రణవ్ బాబు వివాహ వార్షికోత్సవ వేడుకలు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ బాబు - మృణాళిని దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, మామిండ్ల వాడ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, శంకర్, దశరథం, పుష్పలత, కాళీద్ హుస్సేన్, శ్రీనివాస్ పటేల్, తౌసిఫ్, రియాజ్, తాళ్లపల్లి రమేష్ గౌడ్, రవీందర్, శ్రీనివాస్, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పివికి భారత రత్న ప్రకటించడం పట్ల హుజురాబాద్ లో సంబరాలు

**సూర్య, హుజురాబాద్**

వంగర ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదుడు, స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కు భారతరత్న ప్రకటించడం పట్ల హుజురాబాద్ పట్టణంలో పీవీ జిల్లా సాధన సమితి నాయకులు, పీవీ సేవా సంఘం నాయకులు, బిజెపి నాయకులు వేర్వేరుగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పీవీ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి, స్వీట్లు పంపిణీ చేసి టపాకులు పేల్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పీవీకి భారతరత్న లభించడం పట్ల జిల్లా వాసులుగా గర్వపడుతున్నామని అన్నారు. భారత దేశం కోసం పీవీ నర్సింహారావు ఎంతో సేవ చేశారని, కాంగ్రెస్ నేతగా ఉన్న పీవీ నరసింహారావును ఆ పార్టీయే పూర్తిగా విస్మరించిందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తించి కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం దేశ



అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వడం కేంద్రం గొప్పతనం అన్నారు. మాజీ ప్రధాని చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ లకు భారతరత్న పురస్కారం లభించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జెల్ల సుధాకర్, మాసాడి ముత్యం రావు, నల్ల సుమన్, సత్య నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పల్లెని దేవేందర్ రావు, సంజీవరెడ్డి, సంజీవ్, సాయిబాబా, మధిర, రమేష్, బండి సాయి, కృష్ణ, శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకట్, శివ, మోతే తిరుపతి, ఎండి. మునీర్, సారయ్య, గుర్రం సంతోష్, కొలిపాక వెంకటేష్, అనిల్, సమ్మయ్య, విక్రమ్, జంపాల రాజు, రాపాక రాజు, రాజు, అభిరూప్ తదితరులు పాల్గొన్నారు.

**పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో......**

పీవీ నరసింహారావు భారతరత్న ఇవ్వడం పట్ల పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ భీమోజు సదానందం, పొడిశెట్టి వెంకటరాజం, వేల్పుల రత్నం, ఆలేటి రవీందర్, ప్రభాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. పివికి భారతరత్న ఇవ్వడం పట్ల పివి సేవా ట్రస్ట్ అధ్యక్షులు బెల్లి రాజయ్య, జేఏసీ చైర్మన్ ఆవునూరు సమ్మయ్య, పివి సమీప బంధువు లు పివి మదన్మోహన్ రావు, ఇందుర్తి రమేష్, ఇందుర్తి నరేష్, గోపాల్ రావు, హరిహర రావు, మిడిదొడ్డి ప్రదీప్ తదితరులు హర్షం ప్రకటించారు.

# రెచ్చిపోతున్న దొంగలు... భయాందోళనలో ప్రజలు

## - మర్తనపేటలో మూడిళ్లలో చోరీ తాళం వేసిన ఇండ్లే టార్గెట్

## - 27 వేల నగదు, ఆరున్నర తులాల బంగారం,29 తులాల వెండి అపహరణ

## - మర్తనపేటలో వివరాలను తెలుసుకుంటున్న డీఎస్పీ నాగేంద్ర చారి

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలంలో దొంగలు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన వెళ్లే టార్గెట్ గా చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల మంగళపల్లి లో జరిగిన దొంగతనం మరువక ముందే దొంగలు మర్తనపేటలో మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కోనరావుపేట మండలంలోని మర్తనపేట గ్రామానికి చెందిన బోనాల నర్సయ్య గురువారం ఇంటికి తాళం వేసి సిరిసిల్లలోని తన కొడుకు వద్దకు వెళ్ళాడు. దొంగలు గురువారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి నర్సయ్య ఇంట్లో రూ.25 వేల నగదు, ఆరున్నర తులాల బంగారం,20 తులాల వెండి, ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్ ఇంట్లో అర తులం బంగారం,9 తులాల వెండితో



పాటు ఇదే ఇంట్లో కిరాయికి ఉంటున్న వెటర్నరీ డాక్టర్ సాగర్ ఇంట్లో రూ.2వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. నర్సయ్య ఇంటి తలపులు తెరచి ఉండడాన్ని ఇంటి పక్కన ఉన్న స్థానికులు గమనించి నర్సయ్య కు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర గా పడి ఉండి బీరువా తాళాలు పగులగొట్టి బీరువాలో ని నగదు, బంగారం, వెండి దొంగలు ఎత్తుకెళ్లారు. విష యాన్ని పోలీసులకు సమాచారం అందించగా డీఎస్పీ నాగేంద్ర చారి,సీఐ కిరణ్ కుమార్,ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి లు సంఘటన స్తలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, పోలీస్ జాగిలాలు తెప్పించి ఫింగర్ ప్రింట్స్, తదితర వివరాలను సేకరించారు.బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సైఆంజనేయులు తెలిపారు.రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని, బ్లూ కోర్ట్ సిబ్బంది 24 గంటలు గస్తీ తిరగుతూ దొంగలను పట్టుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పలు గ్రామాల్లోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని త్వరలో దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.




## నాపై రాజకీయ కుట్ర జరిగింది అంగన్వాడి టీచర్ లక్ష్మి ఆవేదన..

**సూర్య బోయినపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం తడగొండలోని అంగన్వాడీ ఒకటవ సెంటర్లో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి టీచర్ లక్ష్మి మాట్లాడుతూ నేను గత 24 సంవత్సరాలుగా అంగన్వాడి టీచర్ గా పని చేస్తున్నానని నాపై గ్రామంలో రాజకీయంగా కుట్ర చేసి అధికారులకు ఫిర్యాదులు ఇచ్చారని. జిల్లాలో బెస్ట్ అవార్డు అందుకున్న అని నాపై తప్పుడు ఆరోపణలు వచ్చాయని అధికారులు పరిశీలించి నాకు న్యాయం చేయాలని కోరారు.

## అబాకస్ జిల్లాస్థాయి పోటీలలో ఇల్లంతకుంట వాణీనికేతన్ విద్యార్థుల ప్రతిభ

**సూర్య,ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ విద్యార్థులు అభాకస్ జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. కరీంనగర్ లో జరిగిన ఇంటర్ స్కూల్ పోటీలలో రాణించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులలో గుండెల్లి విష్ణుప్రియ, తీగల అవంతిక, నాంపెల్లి రిత్విక, సుదగోని పెద్దోళ్ళ సిరి అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వనరాశి శైలజ, గుంజి సూర్యఅభిలాష్, వజ్జపల్లి హాసిత్, మహమ్మద్ సల్మాన్, గుండెల్లి ఆరుష్ లు ఉత్తమంగా నిలిచి బహుమతులు అందుకున్నారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడానికి అబాకస్ దోహద పడుతుందన్నారు. అబాకస్ ద్వారా విద్యార్థులలో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈసందర్భంగా విజేతలుగా నిల్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి. అబాకస్ టీచర్లు రమేష్, రాజు, సుమంగళి, రాజులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తడగొండ అంగన్వాడి కేంద్రం 1 సెంటర్ టీచర్, ఆయాలను విధులనుండి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు

**సూర్య బోయినపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండ అంగన్వాడి 1 వ కేంద్రం టీచర్, ఆయాలను విధులు నుండి తొలగిస్తూ కలెక్టర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఐసిడిఎస్ తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి మండలం తడగొండ అంగన్వాడి 1 సెంటర్ టీచర్ గుడి లక్ష్మి, ఆయా ఎడపల్లి లక్ష్మీల మధ్య తరచూ తగాదాలు రావడంతో , ఫుడ్ స్టాక్ లో వ్యత్యాసం రిజిస్టర్లను రెగ్యులర్గా అప్డేట్ చేయకపోవడం, ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ విచారణ అధికారిగా జిల్లా హార్టికల్చర్ అధికారిని జ్యోతిని నియమించారు. ఆమె గ్రామంలో విచారణ చేపట్టరు.సమగ్ర నివేదికను కలెక్టర్ కు అందజేయగా శాఖపరమైన చర్యలు తీసుకుంటూ విధుల నుండి వారిద్దరిని టీచర్,అయాలను తొలగించుటకు ఆదేశాలు జారీ చేసినట్టు సూపర్వైజర్ నిర్మల తెలిపారు.

## రూసో కళాశాలలో టీచర్ రికట్మెంట్ డ్రైవ్..

**సూర్య బోయినపల్లి**

బోయినిపెల్లి మండలం వెంకట్రావుపల్లి లోని రూసో కళాశాల ఆధ్వర్యంలో ప్రైమరి హైస్కూల్లో I.B, I.C.S.E., C.B.S.E స్టేట్ బోర్డ్ సిలబస్ ననుసరించి 5 బ్రాంచిలతో నడపబడుచున్న పారమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరీంనగర్లో పని చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులకు నేడు శనివారం టీచర్ రికట్మెంట్ నిర్వహించబడుచున్నది. డి.ఎడ్, బి.ఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉదయం:10-00 నుండి 4-00 వెంకట్రావుపల్లి లోని రూసో కళాశాల నందు డెమో మరియు ఇంటర్వ్యూ కు హాజరై ఉపాది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని రూసో కళాశాల చైర్మేన్ పెరియాల దేవేందర్ రావు కోరారు.

## పొలాస విద్యార్థుల పొలం బాట

**సూర్య బోయినపల్లి**



జగిత్యాల (పొలాస) వ్యవసాయ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థినులు పొలం బాట పట్టారు. మొన్నటిదాకా తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టి.. క్షేత్రస్థాయి అధ్యయనానికి కదిలారు. తాము ఇన్నాళ్లూ అభ్యసించిన చదువు కార్యరూపం దాల్చేలా.. వ్యవసాయ క్షేత్రంలో పరిశోధనలు మొదలు పెట్టారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో కలియ తిరుగుతున్నారు. గ్రామంలో ఉంటూ నిత్యం రైతులతో మమేకమవుతూ క్షేత్రస్థాయిలో సేద్య విధానాలు తెలుసుకోవడమే కాకుండా సాగు పాఠాలు నేర్పుతున్నారు. ఈ సందర్భంగా పొలాస విద్యార్థినిలు స్రజనీత , వినీతరెడ్డి , అనూష, శ్వేత, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం, సామాజిక వనరుల , ప్రేపరెన్స్ ర్యాంకింగ్, సమస్యల చెట్టు, కాలక్రమం తదితర అంశాలపై ముగ్గులతో చిత్రాలు వేసి గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత డా.రాజేంద్రప్రసాద్ ,మాజీ సర్పంచ్ బూర్గుల నందయ్య , ఏఈవో రజిత,మాజీ వార్డు సభ్యులు నల్లాల పద్మ, మరాటి అజయ్, ప్రత్యేక అధికారి రాధిక , కుస రవీందర్, కుస రాజేందర్, ఆకుల ప్రశాంత్, ఎర్ర రమేష్, నల్లాల శ్రీకాంత్, కొండా బన్నీ, నల్లాల మహేందర్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తధితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్న మహిళను కాపాడిన పోలీసులు

**సూర్య బోయినపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావు పల్లి గ్రామానికి చెందిన మహిళ అప్పుల బాధ భరించలేక శుక్రవారం మిడ్ మానేరులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్ళాగ. సమాచారం అందుకున్న బోయినపల్లి ఎస్సై శ్రీకాంత్ అట్టి మహిళను రక్షించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ చేసి అప్పగించారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రజా పాలనపై గ్రామాల్లో సర్వే నిర్వహణ

**సూర్య,రాయికల్**



ప్రజా పాలన కార్యక్రమం సందర్భంగా అధికారుల నుండి వివిధ పథకాల లబ్ధి కోసం దరఖాస్తులు తీసుకున్న అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కార్యద ర్శులు అంగన్వాడి, గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటింటా తిరుగుతూ లబ్ధిదారుల సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా రూ.500 సిలిండర్ సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

### - ఎంపిపి. వూట్కూరి వెంకటరమణారెడ్డి

**సూర్య. ఇల్లంతకుంట**



పాఠశాలల్లో నాణ్యమైన విద్య తో పాటు విధ్యార్థులకు మౌళిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు అడుగులేస్తుందని ఎంపిపి వూట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు.శుక్రవారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం బోర్ వెల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, ఎంపిపి పనులు ప్రారంభించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలుపొంది, మొదటిసారిగా ఇల్లంతకుంట హైస్కూల్ కు విచ్చేసిన సందర్భంగా, విద్యార్థులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు బోరు మంజూరు చేయమని అడగడంతో, ఎమ్మెల్యే స్పందించి బోరు వేయించినట్లు ఎంపిపి తెలిపారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఎంపిపి వూట్కూరి వెంకటరమణారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, కార్యదర్శి వరుణ్, ఉపాధ్యాయులు తుంకుంట మోహన్ రెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## అయిల్పాం, వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

**సూర్య రుద్రంగి**



రుద్రంగి మండల కేంద్రంలో అయిల్ ఫాం, వరి పంట పొలాలను డీఎఓ భాస్కర్, ఎఓ దుర్గరాజ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిల్పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వరి పంటలకు ప్రత్యామ్నయంగా అయిల్పాం సాగు చేయాలన్నారు. అయిల్పాం సాగు చేస్తే ప్రభుత్వ రాయితి కింద డ్రీప్, ఏటా 4200 రూపాయలు అంతర పంటకు సహాయం అందించడం జరుగుతుందన్నారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు యాజమాన్య పద్ధతులని వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి, ఆయిల్ ఫామ్ ఇంచార్జు చంద్రయ్యలతో పాటు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

### -తాసీల్దార్ శ్రీలత

**సూర్య రుద్రంగి**



విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని స్థానిక తాసీల్దార్ శ్రీలత అన్నారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంను తాసీల్దార్ శ్రీలత తనిఖీ చేసి విద్యా బోధన, భోజన మెనూ, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి సూచించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలోని భోజన మెనూ సరిగా అమలు చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో ఎవరైనా అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మంకు వనితలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బధిరుల ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- గుడ్ టచ్ బ్యాడ్ టచ్, విద్య ప్రాముఖ్యత గురించి వివరించాలి
- బధిరుల ఆశ్రమ పాఠశాలలో లైబ్రరి ఏర్పాటు చేస్తా
- పిల్లల తల్లితండ్రులకు, టీచర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

వైకల్యం తోడైన అద్భుతమై విజయాలను సొంతం చేసుకోగల బధిరుల ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్నేహిత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శరీరంలో అన్ని అవయవాలు సరిగా పనిచేసినప్పటికి అనుకున్న విజయాలను సాధించడంలో కొందరు వెనకబడి పోతారని, కాని వైకల్యం తోడైనప్పటికి సకలాంగులకన్న అద్భుతమైన విజయాలను బధిరులు సునాసంగా సాధించగలరని, అలాంటి వారి ప్రతిభను ప్రపంచానికి చాట్టిచేప్పాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గతంలో పనిచేసిన జిల్లాలలో స్నేహిత కార్యక్రమాలను నిర్వహించినప్పటికి, కరీంనగర్ జిల్లాలో బధిరుల పాఠశాలలో నిర్వహించిన స్నేహిత కార్యక్రమం



ఎక్కువ సంతోషాన్నిచ్చిందని అన్నారు. మానసిక, శారీరక వికలాంగుల కొరకు సమయాన్ని, శక్తిమేర కృషిని ప్రతిఒక్కరు అందించాలని పిలుపునిచ్చారు. వయస్సుతో పాటు శరీరంలో మార్పులు సంభవిస్తాయని, వాటికి అనుగునంగా పిల్లలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్, విద్య ప్రాముఖ్యం, పాఠశాల వద్ద లేదా ఇంటివద్ద ఎవరివల్లనైన ఇబ్బందులు ఎదురైతే వాటిని గురించి ధైర్యంగా తల్లితండ్రులకు గాని టీచర్లకు గాని చెప్పేలా పిల్లలను ప్రోత్సహించా లన్నారు. గతంలో సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహించిన క్రిడాపోటిలలో చెస్ పోటీలలో పాల్గొన్న అంధులను చూడగానే ఎంతో ఆద్భు తంగా అనిపించిందని, ఈలాంటి సంఘటనలు అనుకున్న విజయాలను సొంతం చేసుకోవడంలో ఎదురయ్యే ఎన్నో ప్రశ్నలకు సమాదానాలుగా నిలుస్తాయని అభివర్ణించారు. జిల్లాలోని బధిరుల పాఠశాలలో లైబ్రరి ఏర్పాటు చేస్తానని హామిఇచ్చారు. అనారోగ్యం బారిన పడకుండా ప్రతి ఒక్కరు చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, పరిశుభ్రతను పాటించడం, ఉతికిన బట్టలు వేసుకోవడం వంటి వాటిని పాటించాలని, మనం ఎంత పరిశుభ్రంగా ఉంటామో అంత అందంగా కనిపిస్తామని తెలిపారు. విద్యలోనే కాదు అవకాశం లభిస్తే ఎ రంగంలోనైన విజయాన్ని సాధించగలమనడానికి నిదర్శనంగా నేటి బధిరుల



పాఠశాల విద్యార్థులు నిలిచి ఎందరికో అందర్శంగా నిలిచారని కొనియాడారు. అంతకు ముందు బధిరుల విద్యార్థులు కాగీతాలతో చేసిన పూల బోకేలను, పేపర్ పై గీసిన కలెక్టర్ చిత్రాన్ని కలెక్టర్ కు అందించారు. అనంతరం నృత్యప్రదర్శన చేసి గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఇతరుల వల్ల కలిగే ఇబ్బందులపై ఎలా స్పందించాలి అనే వాటిని ప్రదర్శించారు. అనంతరం ఫిబ్రవరి 4,5, 6వ తేదీలలో ముంబాయిల్ జరిగిన సైరో ఒలంపిక్ లో పాల్గోని16 ఇవెంట్ లలో 17 బహుమతులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెమెంటో లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జిల్లా సంక్షేమశాఖ అధికారి సరస్వతి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సి డబ్ల్యూ సి ధనలక్ష్మి, డాక్టర్ నజియా ఫాతిమా, షీ టీం సీఐ శ్రీలత, స్వప్న, పాఠశాల సిబ్బంది, ఇతర అధికారులు, పాల్గోన్నారు.

# ఈవియం గోడౌన్‌లో మొదటి స్థాయి తనిఖీ ప్రక్రియ

- కలెక్టర్ పమేలా సత్పతి



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రానున్న పార్లమెంట్ ఎన్నికల కొరకు నిర్వహిస్తున్న ఎఫ్.ఎల్.సి., ఈవియంలను భద్రపరచడం మరియు వెబ్ కాస్టింగ్ గదులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. శుక్రవారం ఈవీఎం గోడౌన్ లో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎఫ్ఎల్ సి, ఎన్నికల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఎఫ్.ఎల్.సి నిర్వహణ, ఈవియంలో గోడౌన్ లో ఈవీయం బ్యాలెట్ యూనిట్( బి యు) కంట్రోలింగ్ యూనిట్(సి యు ),వివిపాట్ యంత్రాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, డి.అర్.ఓ పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బీఆర్ఎస్ పార్టీ సత్తినేని శ్రీనివాస్, బీజేపీ పార్టీ ప్రతినిధి సత్యనారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి కళ్యా డపు ఆగయ్య, బిఎస్పీ ప్రతినిధి గాలి అనిల్ కుమార్, ఎం. ఐ.ఎం బర్కత్ అలి తదితరులు పాల్గోన్నారు.

# పిల్లల అపహరణపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- పిల్లలను తీసుకెళుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం నిజం కాదు
- సమచారం ఉంటె డయల్ -100 కు సమచారం అందించండి
- తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేసే వారి పై కఠిన చర్యలు.

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రవేశించి పిల్లలను అపహరిస్తు న్నారన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో సోషల్ మీడియాలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు మన జిల్లాలో గ్రామాలలో, పట్టణాల్లో తిరుగుతూ చిన్న పిల్లలను ఎత్తుకెల్లుతున్నారన్న పోటోలు, వీడియోస్ పోస్టు చేస్తున్న ప్రచారం నిజం కాదని స్పష్టం చేశారు. ఇలాంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని,వేరే ప్రాంతాల్లో జరిగిన సంఘటనలకు సంబంధించిన విడియోలు, పోటోలు జిల్లా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేయద్దని జిల్లా ఎస్పీ సూచించారు. సోషల్ మీడియాలో గత రెండు రోజులుగా వస్తున్నట్లు చిన్న పిల్లల కిడ్నాప్ కు సంబంధించిన సమాచారం కానీ,ఫిర్యాదులు ,ఆధారాలు కానీ పోలీస్ వారికి అందలేదని,రోజు వారిగా జిల్లా అంతటా నిరంతరం నిఘా ఉంచి గస్తీ నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో బ్లూ కోల్ట్ వాహనాలు 24/7 పెట్రోలింగ్ నిరహిస్తున్నాయని, జిల్లాలోకి ప్రవేశించే అన్ని రహదారులలో, పట్టణాలలో CC కెమెరాల నిఘా ఉందన్నారు. సోషల్ మీడియా లో వస్తున్న పుకార్లు నిజం కాదని వాటిని ఎవ్వరు నమ్మొద్దని కోరారు. ఇలాంటి సంఘటనలు జరిగినా, సమాచారం ఉన్నా సంబంధిత పోలీస్ అధికారులకు లేదా డయల్ 100 కు సమచారం అందిస్తే పోలీస్ లు వాస్తవాలను విచారించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడో జరిగిన సంఘటనలు జిలాల్లో జరిగినట్టు సోషల్ మీడియాలో తప్పుడు పుకార్లను పోస్ట్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై కూడా పోలీసులు నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం

- జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా

**సూర్య జగిత్యాల**

సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ యాష్మిన్ భాషా అన్నారు. పి ఆర్టియు టీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, జగిత్యాల లో పి ఆర్టియు టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరం లో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో విద్య బోధన ఉపాధ్యాయులకు సవాలుగా మారింది అన్నారు. పిల్లలు సెల్ ఫోన్లకు అలవాటు పడి విద్య పై దృష్టి పెట్టడం లేదని, విద్యార్థులకు ఉపాధ్యాయుల పట్ల , తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు తగ్గిపోయాయని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థలకు అలవాటు పడకుండా చూసుకోవాలని సూచించారు. పి ఆర్టియు టీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, రక్తధానం చేసిన పీ ఆర్ టీ యూ జిల్లా అధ్యక్షులు యాళ్ళ అమర్ నాథ్ రెడ్డితో పాటు 33 మంది ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించి, వారికి సర్టిఫికెట్లను అందించారు. జిల్లాలో వివిధ సమాజ సేవ కార్యక్రమాలు చేపడుతున్న పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు యాళ్ళ అమర్నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనంద్రావులను ఆమె అభినందించారు. అంతకు ముందు పిఆర్టీయు సంఘం ఆవిర్భావ దినం సందర్భంగా జిల్లా అధ్యక్షులు యాళ్ళ అమర్నాథ్ రెడ్డి సంఘ జండా ఎగురవేశారు. ఈ కార్యక్రమం లో పిఆర్టీయు అధికార పత్రిక పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు జాలి



మహేందర్ రెడ్డి,ఇండియన్ రెడ్డి క్రాస్ సోసైటీ ప్రతినిధులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, టీఎన్జీవో అధ్యక్షుడు భోగ శశిధర్ పి ఆర్టియు టీఎస్ రాష్ట్ర నాయకులు జమిల్, రాజు, మహేష్, చంద్రప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి, సురేఖ, జమున, జయప్రద, వసంత, చందన, రాదాలక్ష్మి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాజశేఖర్, మల్లారెడ్డి 18 మండలాల నుండి హాజరైన రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

# అంజన్న ఆదాయానికి ఎసరు?

- గతేడాది 3. 65 కోట్లు ఈ ఏడాది1. 65 కోట్లు తగ్గిన రెండు కోట్ల ఆదాయం...
- అధికారులు కాంట్రాక్టతో కుమ్మక్కు

**సూర్య మల్యాల**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంతలనీలాలకు సంబంధించిన దేవాదాయ శాఖ అధికారులు టెండర్ నిర్వహించారు.. కాగా ఈ తల నీలాల టెండర్ గత ఏడాది 3. 65 కోట్ల ఆదాయం టెండర్ పలకడంతో ఆలయానికి అదేం వచ్చింది.. ప్రస్తుతం ఈ ఏడాది దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు తల నీలాలు సేకరణ కోసం అధికారులు టెండర్ నిర్వహించగా సాధారణ కాంట్రాక్టు అతి తక్కువగా ధరకు1.65 కోట్లకే టెండర్ పలికారు. గత ఏడాది మూడు కోట్ల 65 లక్షలకు కాంట్రాక్టర్లు టెండర్ పలకడంతో ఈ ఏడాది మాత్రం కేవలం కోటి 65 లక్షలకు టెండర్ తక్కువ ధరకే కాంట్రాక్టర్లు దక్కించుకోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.. ప్రస్తుతం ప్రతి ఏడాది ఆలయానికి వచ్చే భక్తులు రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ఎక్కువ ధరకు టెండర్లు కోటు చేయాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు తక్కువ ధరకు టెండర్ దక్కించుకో వడం వెనుక ఆలయఅధికారుల పాత్ర ఉందని భక్తులు ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఈ విషయంపై ఆలయ ఈవో ను వివరణ కోరగా తల నీలాలకు ధర తగ్గిందనికాంట్రాక్టర్లు అందుకే ముందుకు రావడం లేదా ఆలయఅధికారులు చెపుతున్నారు తలనీలాల కోసం ఆరుసార్లు టెండర్ నిర్వహించాం మరోసారి టెండర్ నిర్వహించాము కాంట్రాక్టర్ ఒక కోటి65 దక్కించుకున్నట్టు ఆయన తెలిపారు..



# నైపుణ్యము గల యువత దేశ ప్రగతికి ఎంతో అవసరం

**సూర్య, హుజురాబాద్ రూరల్**

నైపుణ్యం గల యువతి దేశ ప్రగతికి ఎంతో అవసరమని వరంగల్ కాకతీయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ మండలం సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన అవుట్ కం బేస్డ్ ఎద్యుకేషన్ వర్క్ షాప్ ను ఏర్పాటు చేయగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యాలయంలో నేర్చుకున్న విద్య విజ్ఞానాన్ని అందిస్తున్నది, విజ్ఞానంతో పాటు విద్యార్థి నైపుణ్యములు కూడా నేర్చుకొనడం వలన పారిశ్రామిక రంగాలకు అవసరమైన మానవ వనరులను అందించినట్టు అవుతుందన్నారు. అధ్యాపకులు నైపుణ్యంతో కూడిన విద్యను విద్యార్థులకు బోధించాలన్నారు అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. విద్యను బోధించడం ద్వారా విద్యార్థి విషయ పరిజ్ఞానాన్ని పొందుతాడని, నేర్చుకున్న విషయపరిజ్ఞానాన్ని యూనివర్సిటీ పరీక్షలలో సమాధానం రాయడం వలన అతనికి పరీక్షలలో ఫలితాలు వస్తాయని, చదువులో ఇది చాలా ముఖ్యమని అన్నారు. ఒకసారి చదువు పూర్తి చేసిన తర్వాత విద్యార్థి పారిశ్రామిక రంగంలో పని చేయవలసి వచ్చినప్పుడు అతనికి విషయ పరిజ్ఞానంతో పాటు అతను చేస్తున్న పనిలో నైపుణ్యము కలిగి ఉండవలెను. ఉదాహరణకు భవన నిర్మాణం నైపుణ్యము, యంత్ర నిర్మాణం యంత్రము, యంత్రమును పనిచేయించడం, ఒక కంప్యూటర్ ప్రోగ్రామ్ రాయడం, ఒక ఎలక్ట్రానిక్ పరికరాన్ని తయారు చేయడము, రిపేర్ చేయడము, పనిచేయించడం మొదలగునవి



నైపుణ్యములుగా భావించబడతాయని అన్నారు. పారిశ్రామిక రంగంలో పరిశ్రమలో పని చేసే సాంకేతిక సిబ్బందికి కావలసిన నైపుణ్యములు ఉండటం లేదని పారిశ్రామికవేత్తలు పలుమార్లు ఆందోళన వ్యక్తపరుస్తు న్నారని, అందువలన అధ్యాపకులు విద్యార్థి తమ వద్ద మూడు లేదా నాలుగు సంవత్సరములు చదువుతున్నప్పుడు విషయపరిజ్ఞానంతో పాటు నైపుణ్యాన్ని అందించవలసి ఉంటుందని, అది అధ్యాపకుడు మేనేజ్ మెంట్ బాధ్యత అని అన్నారు. అధ్యాప కుడు విద్యార్థులలో నిజాయితీ ఉండేందుకు శతవిధాలా ప్రయత్నించాలని, నిజాయితీ కలిగిన ఉద్యోగులు మాత్రమే పారిశ్రామిక రంగంలో కొనసాగ గలరని, విద్యార్థిని ఇంటర్వ్యూ చేసేటప్పుడు విద్యార్థి మీద ఏ కొంచెం అనుమా నము కలిగిన అతనికి ఉద్యోగం రావడం కష్టమని అన్నారు. కేవలం చదువు నైపుణ్యములు మాత్రమే ఉద్యోగాన్ని ఇవ్వలేవని, విద్యార్థికి సహన శీలత ఎంతో ముఖ్యమని అన్నారు. విద్యార్థులు ఎక్కువ కష్టపడి పని చేసే అలవాటు ఉండాలని, పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు నేర్చుకునే అలవాటు కూడా ఉండాలని పేర్కొన్నారు. నూతన విద్యా విధానములో విద్యార్థికి నైపుణ్యమును అలవరచే విద్య పట్ల ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని అన్నారు. అధ్యాపకుడు బోధన పూర్తి అయిన తర్వాత నిర్వహించే పరీక్షలలో నైపుణ్యమును పరీక్షించే ప్రశ్నలను అడిగి విద్యార్థి సమాధానాలు రాసే విధంగా విద్యార్థిని తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థి తాము నేర్చుకున్న నైపుణ్యములను ప్రాక్టీస్ చేస్తూ ఉండాలని ఒకవేళ అలవాటు తప్పితే కొంత నైపుణ్యాన్ని కోల్పోవాల్సి వస్తుందని ప్రయోగా త్మకంగా నేర్చుకోవటం నిరంతర అలవాటుగా చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కే. శంకర్ మాట్లాడుతూ కమలా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సింగాపూర్ లో ప్రభుత్వ నియమ, నిబంధన ప్రకారము ఉండవలసిన అన్ని ప్రయోగశాలలు ఉన్నాయని, విద్యార్థులు ప్రయోగశాలలో ఎక్కువ సమయంను వినియోగిం చేందుకు సహకరిస్తు న్నామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య మాట్లాడుతూ బోధనా వృత్తిలో ఎప్పటికప్పుడు తగిన మార్పులు వస్తున్నాయని, అధ్యాపకులు వాటిని నేర్చుకొని విద్యార్థులకు బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ వరంగల్ మెకానికల్ ఇంజనీరింగ్ అధిపతి డాక్టర్ పి. శ్రీకాంత్, కమల ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సింగాపూర్ హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి. రాజేశ్వరరావు, ఐక్యూఏసి ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఇంచార్జ్ ప్రొఫెసర్ అండ్ డీన్ డాక్టర్ ఎంవి సతీష్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## దళిత బంధు లబ్ధిదారుల సమావేశం

**సూర్య జమ్మికుంట**



హుజురాబాద్ నియోజకవర్గం లో రెండో విడత దళిత బంధు రాని బాధితులంతా జమ్మికుంట పట్టణం లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో పెద్ద ఎత్తున సమావేశమయ్యారు ఈ మేరకు గత రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని హుజురాబాద్ నియోజకవర్గం లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించగా ప్రభుత్వం మారడంతో రెండో విడత దళిత బంధు రాకుండా పోయింది దీంతో రెండో విడత దళిత బంధు డబ్బులు విడుదల చేయాలని కోరుతూ జమ్మికుంటలో దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే రెండో విడత దళిత బంధు రాలేదని దళిత బంధు సాధన సమితి వ్యవస్థాపకుల లో ఒకరైన మంద రాజేష్ అధికారులపై మండిపడ్డారు ఈ మేరకు జమ్మికుంట పట్టణంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో మాట్లాడుతూ రెండు విడత దళిత బంధు విడుదల చేయకపోతే రాబోయే ఎంపీ ఎలక్షన్లో ఓట్లను బహిష్కరిస్తామని పేర్కొన్నారు సీఎం రేవంత్ రెడ్డి దృష్టి కి వెళ్లి దళిత బందు సాధించుకుందాం అని పిలుపునిచ్చారు సమావేశంలో ఐదు మండలాల కమిటీ అధ్యక్షులు మూడువేల మంది లబ్ధిదారులు పాల్గొన్నారు

## నీతికి, నిజాయితీకి మారుపేరు జబ్బర్ ఖాన్

**సూర్య, సెంటినరీ కాలనీ**



నీతికి నిజాయితీకి మారుపేరు పాత్రికేయుడు జబ్బార్ ఖాన్ అని మాజీ ఎంపీటీసీ వనం రామచంద్ర రావు, ఆర్జీ-3 ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ ఉయ్యాల కుమారస్వామి అన్నారు. కమాన్ పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన జబ్బర్ ఖాన్ ఇటీవల ఉత్తమ విలేఖరిగా అవార్డు అందుకోవడంతో గుండారం లో జబ్బార్ ఖాన్ కు బోకే శాలువాతో అలాగే స్వీట్ తినిపించి గోడ గడియారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతికి నిజాయితీకి మారుపేరు, ఎవరైనా ఆపదలో ఉంటే నేను ఉన్నానని ఆదుకునే ఆపద్బాంధవుడు, భిన్నత్వంలో ఏకత్వం అనే పదానికి నిదర్శకుడు కుల మత ప్రాంత భేదం లేకుండా, చిన్న పెద్ద వయసుతో తేడా లేకుండా అందరి మన్నలను పొందుతూ, కలుపుగోలుతనం వద్ద ఉందని కుమారస్వామి రామచందర్రావు పేర్కొన్నారు. తెలంగాణ స్థాయి బిట్ బిట్ అకాడమీ అవార్డు అందుకున్న జబ్బర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి పూల బోకే ఇచ్చి, శాలువాతో సత్కరించి, వాల్ క్లాక్, అదేవిధంగా ఐ ఎన్ టి యు సి క్యాలెండర్ బహుకరించి స్వీట్ తినిపించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది జూనియర్ విలేకరులకు ఆదర్శంగా నిలుస్తున్న జబ్బర్ ఖాన్ కు ఈ అవార్డు రావడం ఆనందదాయకమని రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు తీసుకోవాలని వారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వనం రామచంద్ర రావు , సీనియర్ ఐఎన్టియుసి నాయకులు, వేగోళపు సత్యనారాయణ గౌడ్, పంజాల వెంకటేశ్వర్లు గౌడ్, అలాగే దుద్దిల్ల శ్రీధర్ బాబు అభిమాన జూనియర్ ఐఎన్టియుసి కార్యకర్తలు, మేకల మారుతి, శ్రీనివాస్, కిరణ్, మహమ్మద్ జుబేర్ డ్రిల్ ఆపరేటర్, సుమన్ గౌడ్, మోత్కూరి రాజు, పాల్గొన్నారు.

## రామయ్యపల్లి గ్రామంలో పోలీస్ కమిషనరేట్ కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమం

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గల రామయ్య పల్లి గ్రామంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు గౌడ్ , ఎస్ఐ కటికే రవి ప్రసాద్ ఆధ్వర్యంలో రామగుండం కమిషనరేట్ పోలీస్ కళాబృందం వారు కళా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కళా ప్రదర్శనలో సాంఘీక దురాచారాలు, సైబర్ నేరాలు,షీ టీమ్స్ ఉపయోగం, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, డయల్-100, హత్యలు, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాలపై, షీ టీమ్స్, అభయ యాప్, వివిధ చట్టాల గురించి ఇతర రుగ్మతల పట్ల గ్రామీణ ప్రజలను చైతన్యం చేస్తూ ఆట,పాటల ద్వారా నాటికల ద్వారా అవగాహన కల్పించడమైనది. అంతేకాకుండా ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేసి తెలిపినట్లయితే వెంటనే పరిష్కారం చేయుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ కానిస్టేబుళ్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి

**సూర్య జగిత్యాల టౌన్**



రాష్ట్రంలో పనిచేస్తున్న ఐదు లక్షల పైబడి ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర రాజధానిలో అన్ని విభాగా లతో కూడిన ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టియు) జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానించింది. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ లో గల ఎస్టియు భవన్ లో జిల్లా అధ్యక్షులు మచ్చ శంకర్ అధ్యక్షతన జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి సీర్ణంచ రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంలో ప్రధాన భాగమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు ఏదైనా దీర్ఘకాలిక, అత్యవసర అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇ హెచ్ ఎస్ పథకం పూర్తిగా ఫెయిల్ అయిందని అలాగే మెడికల్ రియంబర్స్మెంట్ సౌకర్యంలో 20 ఏళ్ల క్రితం మెడికల్ బోర్డు రూపొందించిన ఖర్చుల నిబంధనల పట్టికనే ఇంకా ఇప్పటికీ పరిగణనలోకి తీసుకుంటూ ఉద్యోగికి వైద్య ఖర్చులు చెల్లిస్తున్నారని ఇది ఎంత మాత్రం సరిపోవని వారు వివరించారు. సింగరేణి కార్మికులకు ప్రత్యేక ఆసుపత్రులు ఉన్నట్టే , రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు సైతం పాత పది జిల్లాల కేంద్రాల్లో ఉచిత నాణ్యమైన వైద్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, పెండింగ్ లో ఉన్న మూడు డిఏలు , పిఆర్సి బకాయిలు ఈ ఫిబ్రవరి మాసంలోనే చెల్లించాలని కోరారు. ఈ వేసవి సెలవుల్లోనే నిలిచి పోయిన బదిలీలు పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు బండి శ్రీనివాస్, మేకల ప్రవీణ్, శివ రామకృష్ణ, గంగాధర్, తిరుపతి రెడ్డి, నరేశ్, కృష్ణ,

## విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామగిరి ఎంపీఓ సరెండర్

### -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**సూర్య, సెంటినరీ కాలనీ**



విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామగిరి ఎంపీఓ కాటం భాస్కర్ ను సరెండర్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ప్రోటోకాల్ పాటించని ఎంపీడీవో రమేష్ ను సస్పెన్షన్ చేస్తు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



## బ్యూటీ వెల్నెస్ పైన మహిళలకు నైపుణ్య కార్యక్రమం

**- ముఖ్య అతిథిగా కాంత కుమారి**

**సూర్య ఎండపల్లి**

మండల కేంద్రంలోని రాజారాం పల్లి ఎస్ఆర్ గార్డెన్ లో నిర్వహించిన బ్యూటీషియన్ బ్యూటీ వెల్నెస్ సెమినార్ కార్యక్రమం పలువురి మహిళల్ని ఆకట్టుకుంది, సక్సెస్ బ్యూటీ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో కోలుముల దామోదర్ యాదవ్, ఫౌండేషన్ సహకారంతో బ్యూటీ వెల్నెస్ సెమినార్ నైపుణ్య కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి శ్రీమతి కాంత కుమారి, హాజరై ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి ప్రోగ్రాం ధర్మపురి ఇతర మండలాలలో నిర్వహిస్తే మ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు. చుట్టూ పరిసర ప్రాంతాల నుండి సుమారుగా 260 మందికి పైగాఉత్సాహంతో మహిళలు , యూత్ కాలేజీ స్టూడెంట్స్ సంస్థ తరపున ప్రతినిధులు హాజరై మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించినారు. అనంతరం అడ్లూరి కాంత కుమారి తో పాటు ప్రజా ప్రతి నిధులకు ముఖ్య అతిథులకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ కన్వీనర్ జంగం మహేందర్ సభ్యులు సంగ రంజిత్ వేల్పుల నాగరాజ్ జిల్లా సంపత్ ఆవుల మహేష్ తాజా మాజీ సర్పంచ్ గెల్లు చంద్రశేఖర్ యాదవ్ పలువురు మహిళా మణులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రణవ్ వివాహా వార్షికోత్సవ వేడుకలు

**సూర్య, వీణవంక**

హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల మృణాళిని - ప్రణవ్ ల వివాహ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం హైదరా బాద్ లోని తన నివాసంలో జరుపు కోగా అతిధి బిల్డర్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత కొమ్మిడి రాకేష్ రెడ్డి, వీణవంక మండలంలోని వల్భాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఎక్కటి రఘుపాల్ రెడ్డి, పోతిరెడ్డి పల్లి మాజీ సర్పంచ్ అనూష సతీష్ గౌడ్ లతో పాటు తదితరులు వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణపై విస్తృత ప్రచారం

**సూర్య, హుజురాబాద్ రూరల్**

ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పెద్ద పాపయ్య పల్లి గ్రామంలో సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ పరిసరాల పరిశుభ్రత ప్లాస్టిక్ కవర్ల వాడకంతో అనార్థాలపై గ్రామంలో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అలాగే గ్రామంలోని శివాలయంలో ప్రత్యేకంగా తెప్పించి ఏకబిల్వం రెండు మొక్కలను గ్రామస్తులతో కలిసి నాటాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, సంచులు వాడటం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందని, ప్లాస్టిక్ బదులు బట్ట సంచులు, జూట్ బ్యాగులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్



సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు వాడటం వల్ల వాతావరణం దెబ్బతినమే కాక జీవరాశులు కూడా వ్యాధుల బారిన పడతాయని, పశువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయని వేణుగోపాల్ తెలిపారు. వానలు సకాలంలో కురవాలంటే, ప్రతి మనిషి మనుగడ సాగించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ప్రజలకు ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో ఎదురయ్యే సమస్యలను మొక్కలు నాటడం ద్వారా కలిగే ఉపయోగాలను ఆలయం వద్ద వేణు గోపాల్ కులంకషంగా వివరించి ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరెడ్ల వెంకటేశ్వర్ రెడ్డి, గంగుల శ్రీనివాస్ రెడ్డి, నలుబాల నందయ్య, నలువాల మనోజ్ కుమార్, గుడి రమణారెడ్డి, సుంకేనపల్లి సమ్మయ్య, నరెడ్ల శ్రావణ్ రెడ్డి, ఆలయ పురోహితుడు రాహుల్ పాల్గొన్నారు.

## పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం దేశం గర్వించదగ్గ విషయం

**- ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**సూర్య మంథని**



బహుభాషా కోవిదుడు, అపర చాణిక్యుడు, రాజకీయ దురంధరుడు పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం దేశం గర్వించదగ్గ విషయం అని ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని నియోజకవర్గం నుండి నాలుగు పర్యాయాలు శాసనసభ్యునిగా ఎన్నికై సేవలందించి, దేశ ప్రధాని స్థాయి వరకు ఎదిగి, దేశ కీర్తిని ప్రపంచంలో నలుదిశల వ్యాపింప చేశారని కొనియాడారు. పీవీ నరసింహారావు కు భారతరత్న ప్రకటించడం తెలంగాణ ప్రజలకు, యావత్ తెలుగు ప్రజలకు గర్వకారణమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## కలెక్టరేట్ తో పాటు మంత్రి నివాసాన్ని ముట్టడిస్తాం

**సూర్య, హుజురాబాద్**



టిఆర్ఎస్ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా హుజురాబాద్ లో ప్రవేశపెట్టిన దళిత బంధు రెండో విడత వెంటనే అమలు చేయాలని, లేదంటే బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ తో పాటు మంత్రులను ముట్టడిస్తామని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బాసాల రామస్వామి అన్నారు. శుక్రవారం హుజురాబాద్ లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో మిగిలి ఉన్న నాలుగు వేల కుటుంబాలకు వెంటనే రెండో విడత దళిత బంధు అమలు చేయాలని అన్నారు. దళిత బంధు అకౌంట్ లను ఫ్రీజ్ చేశారని, వెంటనే ఫ్రీజింగ్ ఎత్తివేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల కోసం రెండో విడత ఆపారని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనని చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. రెండో విడత దళిత బంధు వస్తదని చాలామంది దళితులు అప్పులు చేసి మరి తమ వ్యాపారాన్ని పెంచుకున్నారని అన్నారు. దళిత బంధు రెండో విడత రాకపోవడంతో ఆత్మహత్యాయత్నాలకు కూడా పాల్పడుతున్నారని అన్నారు. దళితులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దళిత బంధు రెండో విడత వచ్చేవరకు పోరాటాన్ని ఆపేది లేదని అన్నారు. ఈ సమావేశంలో బిఎస్పి జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్, హుజురాబాద్ మండల అధ్యక్షులు గిన్నారపు మహేందర్, కొంగల కుమార్ యాదవ్, మంద సమ్మయ్య, దొడ్డే శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జి పంజాల దిలిప్ గౌడ్, నరేష్, అజయ్ గౌడ్, రామ్ శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాస్, అజయ్ కుమార్, రంజిత్, రాజ్, వేల్పుల మల్లేష్ పాల్గొన్నారు.

## వైభవంగా అభిషేక మహోత్సవం

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో 12 వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం మయూరగిరి పీఠాధిపతులు శతాధిక ప్రతిష్ఠాపన ఆచార్యులు శ్రీమాన్ శ్రీ నమిల కొండ రమణ చార్య స్వామి ఆధ్వర్యములో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అధ్యనోత్సవాలు, విష్వక్సేన పూజ, పున్యాహ వచనం, దీక్ష స్వీకరణ, అగ్ని ప్రతిష్ట బలిహరణం కార్యక్రమాలు జరిగాయి. అంతే కాకుండా 64 రకాల దివ్య ఔషధాలతోని ఏడు నదుల జలాలతోని పంచామృతాలతో పంచసూక్తలతోనీ 10008 కళాశాల తోని వేంకటేశ్వర స్వామి కి అత్యంత వైభవంగా అభిషేక మహోత్సవం జరగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్య నారాయణ, గ్రామ పెద్దలు, పలు గ్రామాల నుండి వచ్చిన భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీలలో కార్మిక శాఖ అధికారుల విచారణ

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం లొంకకేసారం గ్రామంలో పలు ఇటుక బట్టీలలో స్టేట్ లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులు తమను వేధిస్తున్నారని రామగిరి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్టేట్ లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, రామగిరి పోలీసులు విచారణ చేపట్టారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఏం.వెంకటేశ్వర్లు, గోదావరిఖని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మెరుగు శ్రీకాంత్, రామగిరి ఎస్సై కటికే రవిప్రసాద్, లేబర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.



## సమ్మక్క సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ...

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలం లోని తుర్కలమద్దికుంట గ్రామంలోని పెద్ద గుట్ట వద్ద నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర పోస్టర్ ను శుక్రవారం జాతర కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 21 నుండి 24 వరకు జాతర నిర్వహిస్తున్నట్లు జాతర కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శనం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముత్యాల వెంకటస్వామి, కోశాధికారి కనకట్ల హనుమంతు, ఉపాధ్యక్షులు సందనవేన తిరుపతి, బ్రాహ్మణపల్లి లక్ష్మీ నరసయ్య, సహాయ కార్యదర్శి దాడి నరసయ్య, ప్రచార కార్యదర్శి చిట్టేటి రాజిరెడ్డి, చిల్లోజు రాజేశం, కార్యవర్గ సభ్యులు అక్క పెల్లి సారయ్య, ఈదునూరి భూమయ్య , వార్డు సభ్యులు చంద్రయ్య, తిరుపతి గ్రామ పెద్దలు సంపత్ రెడ్డి , కొండ భూమయ్య, మామిడి లక్ష్మయ్య , ముక్కెర లక్ష్మయ్య, స్వామి, మొండయ్య , ఐలయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ...

**సూర్య-పెద్దపల్లి రూరల్02:**



మండలం లోని హన్మంతుని పేట గ్రామంలోని నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర పోస్టర్ ను శుక్రవారం జాతర కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 21 నుండి 24 వరకు జాతర నిర్వహిస్తున్నట్లు జాతర కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చైర్మన్ పొలుసాని సుధాకర్ రావు, గౌరవ అధ్యక్షులు కంకటి రవికాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్యులు రంగు యుగంధర్, బయ్యపు కొమురయ్య , దామ కనకయ్య, గుజ్జుల గోవిందు, బండి సతీష్, సురభి రవిందర్ రావు , నూనె మల్లయ్య , కనికి రెడ్డి తిరుపతి, మొండెద్దుల పాపయ్య , గుర్రాల సతీష్, కందుల శ్రీనివాస్ , కంది చంద్రయ్య , వేల్పూరి సంపత్ రావు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన....

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలం లోని తుర్కల మద్దికుంట గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తులు వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య , ఎంపీడీఓ రాజు లు ఇంటింటికి తిరిగి పరిశీలించారు. ఇందులో భాగంగా ఉచిత గ్యాస్ కనెక్షన్ 500 రూపాయలు కొరకు, మహాలక్ష్మి పథకం కు అర్హులైన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బి ఈ కార్యక్రమంలో ఎం పీవో సుదర్శన్ , గ్రామ సెక్రెటరీ మాసియుద్దిన్ పాల్గొన్నారు.

## సీఎంకు ఆహ్వాన పత్రికను అందజేసిన జువ్వాడి

**సూర్య -కోరుట్ల**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుమల రేవంత్ దంపతులు తమ ప్రథమ పుత్రిక వివాహ వేడుకలకు హాజర్ కావాలని వివాహ ఆహ్వాన పత్రికను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు-రజని దంపతులు శుక్రవారం హైదరాబాదులో అందజేశారు .

## ఆటో డ్రైవర్లకు అండగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**సూర్య- కోరుట్ల**



కోరుట్ల నియోజకవర్గ ఆటో అన్నల విన్నపం మేరకు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా కోరుట్ల నియోజకవర్గ ఆటో అన్నలకు మద్దతుగా గురువారం ఆటోలో అసెంబ్లీకి వెల్లి తన నిరసనను ప్రభుత్వానికి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో పర్యట ిస్తున్న సందర్భంలో వందలాది ఆటో అన్నలు చాల దుఃఖంతో కనీసం పొట్ట గడిచే పరిస్థితి లేకుండా ఈ ప్రభుత్వం మమ్మల్ని రోడ్డున పడేసిందాని, మాకు ప్రభుత్వం తరుపున సాయం కావాలని కోరారని తెలుపగా,తప్పకుండ వారి బాధను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పి, శుక్రవారం ఆటోలో అసెంబ్లీకి వెళ్లడం జరిగిందని, అసెంబ్లీలో కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని ఒక ప్రకటనలో తెలిపారు.

## హుజురాబాద్ తో పివి కి తీరని అనుబంధం

**- తీపి జ్ఞాపకంగా ఆయన చదివిన బడి**

**సూర్య, హుజురాబాద్**

బహుముఖ ప్రజ్ఞాశాలి వివిధ భాషల ప్రావీణ్యుడు ఆర్థిక సంస్కరణల ఆది పురుషుడు మాజీ ప్రధాని స్వర్గీయ పాములపర్తి వెంకట నరసింహారావు తో హుజురాబాద్ ప్రాంతానికి ఎంతో అవినాభావ సంబంధం ఉంది. హుజురాబాద్ ప్రాంతంలో ఆయన ఊరు వంగర ఉండడమే కాకుండా ఎనిమిదో తరగతి కొన్నాళ్ల పాటు హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. ఈ ప్రాంతంలో ఆయన బంధువులు అనేకమంది ఉన్నారు. ఆయన దేశ ప్రధానిగా ఉన్న కాలంలో ఆయన సమీప బంధువు సింగపూర్ గ్రామానికి చెందిన ఒడితల రాజేశ్వరరావు అత్యంత సన్నిహితంగా మెలిగారు. అప్పటి భీమదేవర పల్లి మండలం వేలేరు గ్రామంలో కూడా ఆయన విద్యాభ్యాసం చేశారు. ఈ ప్రాంతంలో ఆయన బంధువులతో పాటు, పివీ అనుచరులు ఎందరో ఉన్నారు. కాగా 1998 అక్టోబర్ 13న స్వామి రామానంద తీర్థ ట్రస్ట్ స్వర్ణోత్సవాలలో భాగంగా భారత ఖాదీ బోర్డ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణంలో జరగగా ఈ సందర్భంగా పీవీ నరసింహారావు హుజురాబాద్ పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభకు హాజరయ్యారు. ఆయనతో ఈ ప్రాంత ప్రజలకు సీనియర్ పాత్రికేయులకు అవినా బావ సంబంధం ఉంది. పీవీకి భారతరత్న పురస్కారం రావడం పట్ల ఈ ప్రాంత ప్రజలు తమకే వచ్చిందన్న భావనతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పీవీ కి భారత రత్న ఇవ్వడంపై ఖాదీ గ్రామోద్యోగ్ కృతజ్ఞతలు

**సూర్య, చొప్పదండి**

భారత దివంగత ప్రధాని పీవీ. నరసింహరావు కు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న ఇవ్వడం పై మెట్పెల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ సభ్యులు చొప్పదండి మాజీ జడ్పిటీసీ ఇప్పనపెల్లి సాంబయ్య ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.పీవీ నరసింహరావు ఏకైక తెలుగు ప్రధాన మంత్రి అని,బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత, కవి అని కొనియాడారు. అలాగే విప్లవత్మక ఆర్థిక సంస్కరణలు చేపట్టి భారత ఆర్థిక వ్యవస్థ ను గాడిలో పెట్టిన పీవీ 1967 నుండి 1983 వరకు మెట్టుపల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ చైర్మన్ గా పని చేసారని గుర్తు చేశారు.

# జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**- దోమల నివారణకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి :**

**- జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**

**సూర్య జగిత్యాల ప్రతినిధి:**

జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, దోమల నివారణకు ఫ్రై డే డ్రై డే కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమంలో భాగంగా పూడూర్ లోని జిల్లా పరిషత్ హై స్కూల్ మరియు కొండగట్టులో నిర్వహించిన కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం, ఫ్రై డే- డ్రై డే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున అందుచేత పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రత్యేక పారుశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పారిశుద్ధ్యంపై ఇంటింటికి అవగాహన కల్పిస్తూ, త్రాగునీటి పైన ఏమైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించడం, ఇంటింటికి నల్ల కనెక్షన్ ఉందా లేదా, అది ఎలా పనిచేస్తుంది, నాణ్యత ఉందా లేదా, క్లోరినేషన్ ఏ విధంగా జరుగుతుందని, పైన ప్రజల్లో అవగాహన కల్పిస్తూ స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు , గ్రామ సిబ్బంది, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. సూపర్ వైజరీ అధికారులను,



మండల స్పెషల్ ఆఫీసర్లను నియమించి ఈ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూడూరు, కొండగట్టు ప్రత్యేక అధికారులు మణిదీప్, వెంకటేశం, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, SHG మహిళలు, గ్రామస్తులు, అంగన్ వాడీలు, పంచాయతీ కార్యదర్శి, పాల్గొన్నారు.





# జిల్లాలో 16 మంది ఎస్ఐల బదిలీలు

**సూర్య జగిత్యాల ప్రతినిధి:**

జిల్లాలో పనిచేస్తున్న 16 మంది ఎస్.ఐలను వివిధ పోలీస్ స్టేషన్ లకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం ఎస్సై ఎస్.సందీప్ కొడిమ్యాలకు, కొడిమ్యాల ఎస్ఐ కె.వెంకట్రావు DCRB జగిత్యాలకు. ఎ.అనిల్ డిఎస్‌బి జగిత్యాల నుండి వెల్గటూర్ పిఎస్‌కు, కె.శ్వేత వెల్గటూర్ పిఎస్ నుండి కోరుట్ల ఎస్ఐ -2గా, వై.ఇంద్రసేనారెడ్డి కోరుట్ల SI-2 నుండి జగిత్యాలటౌన్ SI-2 గా, జే.రామకృష్ణ ధర్మపురి SI-2 నుండి పెగడపల్లి పిఎస్ కు, సిహెచ్. సతీష్ పెగడపల్లి పి ఎస్ నుండి గొల్లపల్లి కి, ఎ.నరేష్ కుమార్ గొల్లపల్లి నుండి సిసిఎస్ జగిత్యాల కు, ఎం.శ్రీధర్ రెడ్డి డిఎస్బి నుండి బుగ్గారం కు పి.కిరణ్ కుమార్ కథలాపూర్ నుండి మల్లాపూర్ కు, జి.నవీన్ కుమార్ మల్లాపూర్ నుండి కథలాపూర్ కు, అబ్దుల్ రహీం జగిత్యాల్ టౌన్-1 నుండి మల్యాల SI-1 గా, టి.అశోక్ మల్యాల టు డి ఎస్ బి జగిత్యాలకు, పి.దత్తాద్రి ధర్మపురి -1 నుండి జగిత్యాల టౌన్ SI-1గా, పి.ఉదయ్ కుమార్ రెంజల్ నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ నుండి ధర్మపురి SI-1గా, ఎస్.శ్రీకాంత్ మమాడ నిర్మల్ డిస్టిక్ నుండి డి స్ బి జగిత్యాల కు బదిలీ అయ్యారు.

# ఎస్సారెస్పీ కెనాల్లో ఈతకు వెల్లి యువకుడు గల్లంతు

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి పట్టణ శివారులో చిల్ల వాడ సమీపం ఎస్సారెస్పీ కెనాల్లో ఈతకు వెల్లి షేక్ యూసుఫ్ (25)అనే యువకుడు గల్లంతు అయినట్లు పోలీస్ లు తెలిపారు.కుటుంబ సభ్యులు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం షేక్ యూసుఫ్ చిల్లవాడ డి 86 కెనాల్ కు తన బావమరిది ఎం డి. జావీద్ తో కలిసి ఈతకు వెళ్ళాడు.మెట్ల పై ఉండి స్నానం చేస్తుండగా అదే సమయం లో నీటి ప్రవాహం ఒక్క సారిగా పెరగడం తో నీటిలో కొట్టుకు పోయాడు.యూసుఫ్ స్వగ్రామం జమ్మికుంట కాగా అత్త గారి ఊరైన చొప్పదండి లో ఉంటూ హొటల్లో పనిచేస్తున్నాడు.కుటుంబ సభ్యులు గాలీస్తుండగా రాత్రి 9 గంటల వరకు కూడ ఎటువంటి ఆచూకీ లభించలేదు.

# విద్యార్థుల భవిష్యత్ మార్గదర్శకులు ఉపాధ్యాయులు

**- పి ఆర్ టీ యు ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విరుపాక్షి గార్డెన్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు తరగతి గదిలో క్రమశిక్షణ, వారి అభ్యున్నతికి సహకరించేది ఉపాధ్యాయులేనని అన్నారు. రోజు రోజుకు మారుతున్న ఆధునిక పరిస్థితుల్లో యువతను విద్యార్థులను పెడత్రోవ పట్టించే మాదకద్రవ్యాల నివారణలో ఉపాధ్యాయుల పాత్ర ప్రధానంగా ఉంటుందని, ఇందుకు జిల్లా యంత్రాంగంతో సహకరించాలని అన్నారు. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారికి



ఆదేశాలు జారీ చేయడం జరిగిందని వివరించారు. ఉపాధ్యాయ వర్గాలు తరగతి గదుల్లో విద్యను బోధించడంతో పాటు గంజాయి, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాల నివారణలో పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. సామాజిక బాధ్యతగా రక్తదానం కార్యక్రమం నిర్వహించడంపట్ల పిఆర్టీయు నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఆనందరావు, సంఘ సభ్యులను, రక్తదానం చేసిన ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమం లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, టిఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, రోటరీ క్లబ్ ప్రతినిధులు టివి సూర్యం, ఎన్. రాజు, పిఆర్టియు జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు యాళ్ల అమర్నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనంద్ రావు, సంఘ నాయకులు జాలి మహేందర్ రెడ్డి, సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వలస కార్మికులకు అవగాహన..

**సూర్య- పెద్దపల్లి రూరల్**



మండలంలోని రాఘవపూర్ ఇటుక బట్టీల వద్ద వలస కార్మికులకు పోలీసుల ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో బసంత్ నగర్ ఎస్సై వెంకటేష్, బట్టి యజమానులు మాజీ సర్పంచ్ ఆడపు వెంకటేష్ , జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసే కుట్రను విరమించుకోవాలి

**- కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

తెలంగాణ చిహ్నం లో మార్పులు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదని, తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు. చేస్తుందని కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.శుక్రవారం ర కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం మాట్లాడుతూ తెలంగాణ చిహ్నంలో 4వందల ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయ తోరణం , చార్మీ నార్ చిహ్నాలు ఉన్నాయని, కేబినెట్ లో తీర్మాణం చేసి తొలగిస్తామని, తెలంగాణ చిహ్నం రాచరిక పోకడలకు సూచిక లెక్క ఉందని మాట్లాడటం పద్ధతి కాదన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే రాష్ట్రాన్ని పాలించడం చేతకాదని సీమాంధ్ర నేతలు అవహేళన చేసినప్పటికీ 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల పాటు తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి లో అగ్రగామిగా నిలిపారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ చిహ్నాన్ని మార్పులు చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికి సీమాంధ్ర పాలకుల మైకంలో ఉన్నారనే అర్థం అవుతుందని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేస్తామని కూడా మాట్లాడటం దేనికి సంకేతమని, పేర్లు మార్చడం కాదు మీరు ప్రజలకు ఎం చేయబోతున్నారు చెప్పాలని అన్నారు.గత ప్రభుత్వం 7వేల స్టాఫ్ నర్సు, 15వేల కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహిస్తే మీరు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం కాదు...మీరు ఎన్నికల సమయంలో 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఏడాదిలోగానే ఇస్తామని చెప్పారు...ఈ నెలాఖరు వరకు



ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, గంగాధర ఎంపీపీ శ్రీరాం మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, ద్యావ మధుసూదన్ రెడ్డి, బద్దం ప్రవీణ్ రెడ్డి, శ్రావణ్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.